# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, జూన్ 26, 2025 | సంపుటి - 20 | సంచిక 165 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

**కావాలనే కొందరు దీనిని తక్కువ చేసే యత్నం**

**అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వెల్లడి**




వాషింగ్టన్ : ఇరాన్‌పై జరిగిన అమెరికా వైమానిక దాడులు ఆ దేశ న్యూక్లియర్ సౌకర్యాలను పూర్తిగా ధ్వంసం చేశాయని డొనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. కానీ పలు మీడియా నివేదికల నేపథ్యంలో ఇరాన్.. న్యూక్లియర్ కార్యక్రమాన్ని కొన్ని నెలలు మాత్రమే వాయిదా వేశాయని చెబుతున్నాయి. 2లో

## నేటినుంచి నగరంలో బోనాల సందడి

**తొలిబోనం గోల్కొండతో ప్రారంభం**

**నెలరోజుల పాటు బోనాల జాతర**



2

## ఫోన్ ట్యాపింగ్ కేసులో వెలుగులోకి కొత్త విషయాలు

**2023 నవంబర్‌లో భారీగా ఫోన్ ట్యాపింగ్**

**4013 పోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసినట్లుగా ప్రణీత్ రావు అండ్ టీమ్**




2

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజురోజుకు కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా 2023 నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు అధికారులు నిర్ధారించారు.



# ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి

## రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా ఆంక్షలు..

**తయారీ రంగంపై తీవ్ర ప్రభావం**

**కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరిన మంత్రి శ్రీధర్ బాబు**

**రేర్ ఎర్త్ ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు తెలంగాణలోని తయారీ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని, వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయాలపై కేంద్రం దృష్టి సారించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఆ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ప్రత్యేకంగా సమావేశమై వినతి పత్రం సమర్పించారు.**

హైదరాబాద్ : "ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తికి అవసరమైన రేర్ ఎర్త్ మాగ్నెట్లు, కీలక ముడి పదార్థాలు, రసాయనాలు ఎక్కువగా చైనా నుంచే దిగుమతి అవుతున్నాయి. ఈ తరహా పదార్థాల ఎగుమతులపై ఆ దేశం తాజాగా ఆంక్షలు విధించింది. ఆ ప్రభావం ఎలక్ట్రానిక్స్, ఈవీలు తయారు చేసే పరిశ్రమలపై పడింది. రాబోయే రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టం వాటిల్లు తోంది. ముఖ్యంగా తెలంగాణలో తయారీ రంగంపై ఈ ప్రభావం ఎక్కువగా పడుతుంది' అని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఎలక్ట్రానిక్స్, ఈవీ తయారీ పరిశ్రమలకు ఇబ్బంది కలగకుండా వాస్తవ పరిస్థితిని సమీక్షించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.

**పారిశ్రామిక రంగం బలోపేతానికి సహకరించండి..**

రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం పూర్తి స్థాయి సహకారం 2లో



## సీపీఎస్ యూ భూముల సమస్యను పరిష్కరించండి

**నష్టపరిహారం చెల్లించకుండా ప్రైవేట్‌కు బదలాయిస్తే రాష్ట్రానికి నష్టం**

**ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని కోరిన మంత్రి శ్రీధర్ బాబు**

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ(సీపీఎస్ యూ)లకు కేటాయించిన భూముల సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. ఆ మేరకు బుధవారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామిని కలిసి వినతి పత్రం సమర్పించారు. 2లో



## సెప్టెంబర్ 30లోపు పంచాయతీ ఎన్నికలు

**స్థానిక సంస్థల ఎన్నికలపై తొలగిన అనిశ్చితి**

**మూడు నెలల్లో ఎన్నికల నిర్వహణ పూర్తి చేయండి**

**రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెలంగాణ హైకోర్టు ఆదేశం**

**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. ఈ మేరకు రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. సెప్టెంబర్ 30లోగా తప్పనిసరిగా స్థానిక సంస్థల ఎన్ని కలు నిర్వహించాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది.**

హైదరాబాద్ : గత కొంత కాలంగా గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరగకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్త పరుస్తున్నారు. ఈ అంశంపై ఆరుగురు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. వారు దాఖలు చేసిన పిటిషన్‌ను విచా రించిన అనంతరం హైకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వ తరపున న్యాయ వాదులు రిజర్వేషన్ల పక్రియ పూర్తి చేయడానికి కనీసం మరో 30 రోజుల గడువు అవసరం అని తెలపడంతో హైకోర్టు ఆ అభ్యర్థనని పరిగణనలోకి తీసుకుంది. దీనితో రిజర్వేషన్ల పక్రియ పూర్తయిన తర్వాత, ఎన్నికల నిర్వహణకు మరో 60 రోజులు కావాలన్న రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యర్థనకు కూడా కోర్టు అంగీకారం తెలిపింది. దీనివల్ల కలిపి గరిష్ఠంగా 90 రోజుల లోపుల ఎన్నికల పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.

మిగతా 2లో

## తెలంగాణ రైజింగ్-2047కు ప్రశంసలు

**నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి**

**సిఎం రేవంత్ రెడ్డికి టోనీ బ్లెయిర్ లేఖ**



హైదరాబాద్ : తెలంగాణ రైజింగ్-2047ను ప్రశంసిస్తూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ లేఖ రాశారు. .ఇటీవల ఢిల్లీ పర్యటన సందర్భంగా టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 గురించి ఆయనకు వివరించిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఐటీ, ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో లక్ష్యాల గురించి ఆయనతో చర్చించారు. ఈ నేపథ్యంలో టోనీ లబెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్, తెలంగాణ మధ్య అవగాహన ఒప్పందం కుదరగా.. రైజింగ్ విజన్ రూపకల్పన, అమలుకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను ఇరువైపుల ప్రతినిధులు మార్చుకున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 తనను ఆకట్టుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించిన టోనీ ఈ విజన్‌కు సహకరిస్తామని తెలిపారు.

మిగతా 2లో



## ఎమర్జెన్సీ బాధలు అనుభవాలపై పుస్తకం

**ఎక్స్ వేదికగా వెల్లడించిన ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ : దేశంలో ఎమర్జెన్సీ విధించి జూన్ 25తో 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఆనాడు ఎదురైన పరిస్థితులు, ఇబ్బందులపై 'ది ఎమర్జెన్సీ డైరీస్' పేరుతో ప్రత్యేక పుస్తకాన్ని తీసుకొస్తున్నట్లు ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ద్వారా మోడీ వెల్లడించారు. అత్యవ సర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు తాను ఆర్ఎస ఎస్ కార్యకర్తగా ఉన్నట్లు తెలిపారు. ఆ సమయం లో తన ప్రయాణం ఎలా సాగిందో డైరీలో ఉందని చెప్పుకొచ్చారు. ఎమర్జెన్సీ కాలంలో చాలామందికి అనుభవాలు ఉన్నాయని.. ఎన్నో కుటుంబాలు బాధపడ్డాయని గుర్తుచేశారు. 2లో

## సమాజం నుంచి డ్రగ్స్‌ను దూరం చేయాలి

**తెలంగాణ ప్రభుత్వం అందుకు కట్టుబడి ఉంది**

**పోలీసులు మరింత కఠినంగా వీటిని అణచివేయాలి**

**యాంటీ డ్రగ్స్ డే ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ : డ్రగ్స్ నుంచి భవిష్యత్‌లో సమాజాన్ని కాపాడటానికి తెలంగాణ ప్రభుత్వం సంకల్పం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మాదక ద్రవ్యాల కేసులు వస్తే కఠినంగా వ్యవహరించాల్సిందే అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు జాబ్స్‌తో బిజీగా ఉంటు న్నారని.. ఈ క్రమంలో పిల్లలు చెడుకు బానిసలు అవుతున్నారన్నారు. అంతర్జా తీయ డ్రగ్స్ దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్ జలవిహార్ వద్ద యాంటీ డ్రగ్స్ డే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్,

మిగతా 2లో

## పుస్తకాల పేరుతో లక్షల్లో వ్యాపారం

### అధిక ఫీజులు.. అడ్డగోలు దోపిడీ

- విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న ప్రైవేట్
- కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం
- ధనార్జనే ధ్యేయంగా పాఠ్యపుస్తకాల విక్రయాల దందా
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు..

కన్నెత్తి చూడని కమర్షియల్ టాక్స్ అధికారులు








పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులతో అడ్డగోలు దోపిడీ చేస్తూ ఇది చాలదు అన్నట్లుగా ధనార్జనే ధ్యేయంగా పాఠ్యపుస్తకాల పేరుతో లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. ఒక్కో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో వేలాది మంది విద్యార్థుల నుండి తరగతుల వారిగా ఒక్కో తరగతికి ఇంతని రేటు నిర్ణయించి అందిన కాడికి దోచుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఇంత పెద్ద ఎత్తున దందా నడుస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం చోద్యం తమకేమీ పట్టదు అన్నట్లుగా చోద్యం చూస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

పెద్దపల్లి ప్రతినిధి : పేన్ను - పెన్సిల్ నుండి మొదలుకొని పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, స్టేషనరీ మొదలగునవి బిల్లులు లేకుండ రశీదు ఇవ్వ కుండా విక్రయాలు జరుపుతున్న కమర్షియల్ టాక్స్ అధికారులు కన్నెత్తి చూడక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పుస్తకాల విక్రయాలకై ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు వారి పాఠశాలల సమీపంలోని ఇండ్లను అద్దెకు తీసుకొన్న చిన్న గదుల ముందు విద్యార్థుల తల్లిదండ్రులు రేషన్ షాపులకు జనాలు క్యూ లైన్ లో వేచి ఉన్నట్టుగా పుస్తకాల కోసం లైన్లో గంటల తరబడి వేచి ఉండి మరి కొనుగోలు చేస్తున్న అధికారులకు మాత్రం 2లో

# ఇరాన్ న్యూక్లియర్ వ్యవస్థను దెబ్బతీసాం

ఈ నివేదికలను ట్రంప్ నకిలీ వార్తలని తోసిపుచ్చారు. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఎలాట్‌ఫామ్‌లో ఒక పోస్ట్‌లో ఇలా పేర్కొన్నారు. ఈ వార్తలు ప్రచురించే సీఎన్‌ఎన్, న్యూయార్క్ టైమ్స్‌లు కలిసి ఈ చారిత్రక విజయవంతమైన సైనిక దాడిని చిన్నబుచ్చే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇరాన్‌లోని న్యూక్లియర్ సౌకర్యాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ మీడియా సంస్థలు ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నాయని ట్రంప్ తెలిపారు. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా ఈ నివేదికలను పూర్తిగా తప్పు అని తిరస్కరించారు. ఈ నివేదికలు ట్రంప్‌ను అవమానించేందుకు చేసిన ప్రయత్నమని ఆమె అన్నారు. 14 లక్షల కిలోల బాంబులను ఖచ్చితంగా లక్ష్యంపై వేస్తే ఏమవుతుందో అందరికీ తెలుసని అన్నారు. డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (ఆఎం) నివేదిక ప్రకారం, జూన్ 22న అమెరికా ఇరాన్‌లోని మూడు న్యూక్లియర్ కేంద్రాలైన ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్‌లపై దాడులు జరిపింది. అయితే ఈ దాడుల్లో ఇరాన్ న్యూక్లియర్ ప్రధాన భాగాలను ధ్వంసం కాలేదని , కేవలం కొన్ని నెలల తర్వాత వాయిదా వేశారని ఈ నివేదిక చెబుతోంది. ఈ సౌకర్యాలకు నష్టం జరిగినప్పటికీ, ఇరాన్ న్యూక్లియర్ మౌలిక సౌకర్యాలు చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని తెలుస్తోంది. ఈ షయంపై సమాచారం ఇచ్చిన ఇద్దరు వ్యక్తులు, గుర్తింపు వెల్లడించకుండా, ఈ దాడులు ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ సౌకర్యాలకు నష్టం కలిగించినప్పటికీ, వాటిని పూర్తిగా ధ్వంసం చేయలేకపోయాయని చెప్పారు. ఇరాన్‌లోని అత్యంత సుసంపన్నమైన యురేనియం కొన్ని స్థలాల నుంచి దాడులకు ముందే తరలించబడి సురక్షితంగా ఉందని, సెంట్రిఫ్యూజ్‌లు కూడా చాలా వరకు సురక్షితంగా ఉన్నాయని వారు తెలిపారు. ఫోర్డోలోని లోతైన భూగర్భ యురేనియం శుద్ధి కర్మాగారం వద్ద ప్రవేశ ద్వారం కూలిపోయింది. మౌలిక సౌకర్యాలకు నష్టం జరిగింది. అయితే, భూగర్భంలోని ప్రధాన నిర్మాణాలు ధ్వంసం కాలేదని ఒక వ్యక్తి తెలిపారు. గతంలో జరిగిన అంచనాలు కూడా ఈ ఫలితాన్ని హెచ్చరించాయని ఆ వ్యక్తి చెప్పారు. ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ దాడులు పూర్తి విజయవంతమయ్యాయని చెప్పినప్పటికీ, డిఐఏ నివేదిక వారి వాదనలను ఖండిస్తోంది. ఈ దాడులు ఇరాన్ న్యూక్లియర్ కార్యక్రమాన్ని గణనీయంగా దెబ్బతీసినప్పటికీ, దానిని పూర్తిగా నాశనం చేయలేకపోయాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నాయకుల వాదనలకు విరుద్ధంగా ఉంది. ఈ వివాదం ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## పుస్తకాల పేరుతో లక్షల్లో వ్యాపారం

ఇవేమీ కనబడడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు పాఠ్యపుస్తకాలు మావి - నోట్ బుక్కులు మీవి అంటూ ఆశ చూపుతూ బినామీలతో బుక్ స్టోర్, క్లాత్ స్టోర్లలో కమిషన్ విక్రయాలు జరుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, దుస్తులు మరే ఇతర విక్రయాలు జరపవద్దని హెచ్చరించిన, పలు విద్యార్థి సంఘాలు సైతం ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలు జరుపవద్దని ఆందోళనలు చేపట్టి ఎక్కడికి అక్కడ అడ్డుకట్ట వేస్తూ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఇవేమీ తమకు పట్టవన్నట్లు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాలు బినామీలను ఏర్పాటు చేసుకొని పాఠ్యపుస్తకాలను విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు.

### పాఠ్యపుస్తకాలు మావి - నోట్ బుక్కులు మీవి

జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రముఖ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ పాఠ్యపుస్తకాల విక్రయ దందాను బినామీలను ఏర్పాటు చేసుకొని పట్టణంలోని బుక్ స్టోర్స్, క్లాత్ స్టోర్ యజమానులతో కమిషన్ ఒప్పందం ఏర్పాటు చేసుకొని పాఠ్య పుస్తకాలు మావి నోట్ బుక్కులు మీవి మా స్కూల్ పాఠ్యపుస్తకాలను మేము చెప్పిన రేటుకు విక్రయించి నోట్ బుక్ లను మీరే అమ్ముకోండని కమిషన్ ఆఫర్లను ఇస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రముఖ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలైన ట్రినిటీ యజమాన్యం వారి పాఠశాలకు సమీపంలోనే గదిని అద్దెకు తీసుకొని పాఠ్య పుస్తకాలు విక్రయిస్తుండగా, పల్లవి మోడల్ స్కూల్ యజమాన్యం పట్టణ కేంద్రంలోని ఓ ప్రముఖ ఫంక్షన్ హాల్ ఎదురుగా గదిని అద్దెకి తీసుకొని పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్నారు. స్మార్ట్ కిడ్స్, క్రిసెంట్, మొదలగు కొన్ని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ లోని బుక్ సెల్లర్స్ షాపులలో తమ పాఠశాలల పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఈ దోపిడీ ఏంటని నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రులకు తాము చెప్పిన దుకాణాలు షాప్ లలోనే పుస్తకాలు యూనిఫామ్ లు కొనుగోలు చేయాలని, వేరే ఏ ఇతర దుకాణాలలో షాపులలో కొనుగోలు చేస్తే ఆ పుస్తకాలు చెల్లుబాటు కావని పాఠశాలల యజమాన్యాలు భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. స్కూల్ ఫీజుల కంటే పాఠ్యపుస్తకాలు,యూనిఫాంల ఖర్చు అధికమవుతున్నదని, మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఇప్పటికే అధిక ఫీజులతో అతలాకుతలమైపోతున్న పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం,తదితరాల ఖర్చులు మోయలేని భారంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలల యజమాన్యాలు ఇంత పెద్ద ఎత్తున పాఠ్య పుస్తకాల విక్రయ దందాను నిర్వహిస్తుంటే అడ్డుకట్ట వేయాల్సిన విద్యా శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యజమాన్యాల నుండి విద్యాశాఖ అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు ముట్టడం వలన అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఆయా పాఠశాలల్లో జరిగే పాఠ్యపుస్తకాల విక్రయాల దందాను విద్యార్థి సంఘాల నాయకులు ఎప్పటికప్పుడు అడ్డుకుంటూ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన విద్యాశాఖ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా విక్రయాలు జరపవద్దని మందలిస్తూ పూర్తిస్థాయిలో వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, స్పందించి ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

**ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్:**



విద్యా బోధన పేరిట వ్యాపారం చేస్తున్న పలు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఏలాంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలలో బుక్స్, డ్రెస్సెస్, స్టేషనరీ సామాగ్రి అత్యధిక ధరకు విక్రయిస్తున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలి.

**నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాల విక్రయం చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి**

**- ఏబీవీపీ నాయకులు బండి రాజశేఖర్**



నిబంధనలకు విరుద్దంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్య హక్కు చట్టం 2009 నీ తుంగలో తొక్కుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాల మీద పాఠశాలల పేర్లు ముద్రించి యూనిఫామ్స్ అమ్ముతూ సరస్వతి నిలయాలలో వంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చి డబ్బులు దండుకుని ప్రయత్నం చేస్తున్నారు వెంటనే మీరు అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలల మీద మరియు బుక్స్ మరియు యూనిఫామ్స్ అమ్ముతున్న పాఠశాలలను గుర్తించి వాటిని మూసివేయాలి.

# ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి

అందించాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌ను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ముఖ్యంగా హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-వరంగల్, హైదరాబాద్-బెంగళూరు మరియు హైదరాబాద్-విజయవాడ ఇండస్ట్రీయల్ కారిడార్ల అభివృద్ధి వివరాలు వివరించారు. జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రీయల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద అవసరమైన మౌలిక సదుపాయాల కోసం రూ.400 కోట్ల నిధులు పీఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఫ్యూచర్ సిటీ అభివృద్ధి.. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్-వరంగల్ ఇండస్ట్రీయల్ కారిడార్ నిలిచిపోయిందని కేంద్రమంత్రికి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. అయితే.. ఇందులో భాగంగాఉన్న ఫార్మా సిటీని ప్రభుత్వం ఇప్పుడు 'ఫ్యూచర్ సిటీ'గా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఇందుకు సహకరించాలని కోరారు. అలాగే వరంగల్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి సహా పలు నోడ్స్‌కు కేంద్రం నిధులు విడుదల చేసేలా చొరవ చూపాలని కోరారు. తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వండి.. కేంద్రం ప్రతిపాదించిన 100 పారిశ్రామిక పార్కుల పథకం కింద తెలంగాణలో పార్కుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తమ అభిప్రాయాలు పంపినట్లు గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టులకు తగిన నిధులు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయండి. దేశంలో డిజైన్ రంగాన్ని ఉద్ధరిస్తూ, మేడ్ ఇన్ ఇండియా ఉత్పత్తుల ద్వారా గ్లోబల్ గుర్తింపు సాధించేలా హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ ఏర్పాటు చేయాలని రాష్ట్రం ప్రతిపాదించిందన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంలో తెలంగాణ భాగస్వామ్యం.. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ పారి శ్రామిక రంగాన్ని బలోపేతం చేస్తోందని, కేంద్రంతో కలిసి వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాధనలో రాష్ట్రం ముందుంటుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

## నేటి నుంచి నగరంలో బోనాల సందడి

హైదరాబాద్ : నేటి నుంచి ఆషాడం ప్రవేశంతో జంటనగరాల్లో బోనాల సందడి మొదలు కానుంది. ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే బోనాల ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం బోనాలను అధికారిక పండుగగా ప్రకటించినది. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని అలయాల్లో ఉన్న అమ్మవార్లకు భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేసింది. గోల్కొంట కోటలో బోనాలు మొదట ప్రారంభించే సంప్రదాయం వస్తుంది. దీంతో గోల్కొండ బోనాలతో సందడి మొదలు కానుంది. గురువారం మొదలు కానున్న ఈ సందడిలో భాగంగా ఆదివారం గోల్కొండ బోనాలు జరగనున్నాయి. బోనాలు సంప్రదాయం ప్రకారం ప్రసిద్ధి చెందిన గోల్కొండ కోటలోని శ్రీఎల్లమ్మ (జగదాంబిక) ఆలయంలో ప్రారంభం కావడం ఆనవాయితీ. ప్రతీ సంవత్సరం ఆషాడమాసంలో ఆమావాస్య తర్వాత వచ్చే గురువారం, లేదా ఆదివారం బోనాలు ప్రారంభవవుతాయి. అయితే, ఈ నెల బుధవారం అమవాస్య కావడంతో ఆ తర్వాత రోజు గురువారం బోనాల జాతర మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తుంది. బోనాలు ఉత్సవాలకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని శ్రీజగదాంభిక ట్రస్టు బోర్డు ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే మంత్రి పొన్న ప్రభాకర్ సమీక్ష చేశారు. గురువారం నుంచి జూలై 24వతేదీ వరకు తెలంగాణలో బోనాల జాతర జరుగనుంది. నెలరోజుల పాటు ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు రానున్నారు. వీరికోసం గోల్కొండ కోటలోని అక్కన్న మాదన్న కార్యాలయాలు, బాడిగార్డ్స్ లైన్స్ ప్రాంతాలు సిద్ధం చేస్తున్నారు. పూజల ప్రారంభోత్సవంలో భాగంగా మొదటి రోజు లంగర్‌హౌజ్ చౌరస్తా నుంచి అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తారు. చోటాబజార్‌లోని ఆలయం పూజారి ఇంటి నుంచి అమ్మవారి విగ్రహం, ఘట్టం ఊరేగింపు, బంజారాదర్వాజ నుంచి మొదటి బోనం ఊరేగింపు నిర్వహిస్తారు. ఇవన్నీ గోల్కొండ కోటపైకి చేరిన తర్వాత ఆలయం ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, బోనం అమ్మవారిక సమర్పిస్తారు. కోటలో బోనాల జాతర జరుగనుండ డడంతో గోల్కొండ కోట పాలన చూస్తున్న కేంద్ర పురావస్తు శాఖ పలు మార్పులు చేయనుంది. బోనాలు జరిగే ఆదివారం, గురువారం రోజుల్లో ఉచిత ప్రవేశం కల్పించారు. కోటలో ప్రతీ రోజు రాష్ట్ర పర్యాటక సంస్థ రెండు లైట్ అండ్ సౌండ్ షోలు నిర్వహిస్తుంది. ఆదివారం, గురువారాలు మొదటి షోను రద్దు చేస్తారు. రెండవ షో 8 గంటల నుంచి యధావిధిగా ఉంటుంది.

## సీపీఎస్ యూ భూముల సమస్యను పరిష్కరించండి

'1960లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన కోసం హైదరాబాద్ చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల్లో విలువైన భూములను రాయితీ ధరకు హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్(324.87 ఎకరాలు), హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్(126.33 ఎకరాలు), ఐడీపీఎల్(551.03 ఎకరాలు), హెచ్‌ఎంటీ(888.05 ఎకరాలు) సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (2,272.85 ఎకరాలు), ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ(3,020 ఎకరాలు) తదితర సంస్థలకు కేటాయించింది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'ప్రస్తుతం రాష్ట్రంలోని సీపీఎస్ యూల్లో కొన్ని మూతపడ్డాయి. మరికొన్నింటిలో ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా ఆ పరిశ్రమలకు కేటాయించిన భూములు నిరుపయోగంగా మారాయి. కొన్ని సంస్థలు ఈ భూములను వాణిజ్య పరంగా వినియోగించుకునేందుకు వీలుగా ప్రైవేట్ సంస్థలకు బదలాయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి' అని చెప్పారు. 'సరైన పరిహారం చెల్లించకుండా భూములను ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేయడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు భంగం కలగకుండా నిరుపయోగంగా ఉన్న సీపీఎస్ యూ భూముల వినియోగానికి మార్గదర్శకాలు రూపొందించాలి' అని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లుగా మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## తెలంగాణ రైజింగ్-2047కు ప్రశంసలు



తెలంగాణ రైజింగ్-2047పై సీఎం రేవంత్ రెడ్డిని టోనీ ప్రశంసించారు. రే తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశిరచుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ, పెట్టుబడుల సాధన, రైతులు, మహిళా, యువ సాధికారిత, మౌలిక వసతుల కల్పన, ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి లక్ష్యాలను, చేరుకునే మార్గాలను వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన అమలుకు సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్నారు టోనీ బ్లెయిర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ ఛేంజ్ , తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లోని స్పష్టత నిర్దేశించుకున్న లక్ష్యాలు ఎంతో ఆకట్టుకున్నాయంటూ టోనీ ప్రశంసలు కురిపించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు ఇండియాలోని ప్రతినిధి తెలంగాణ ప్రభుత్వానికి సహకరిస్తారని టోనీ తెలియజేశారు. ఈ క్రమంలో సీఎంవోకు ఏవైనా సందేహాలు ఉంటే ఎటువంటి సంకోచాలు లేకుండా తమ ఃఃఎఉఅ భారత ప్రతినిధిని సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డికి టోనీ÷-లబెయిర్ సూచించారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు టోనీ÷-లబెయిర్ తెలిపారు.

## ఎమర్జెన్సీ బాధలు అనుభవాలపై పుస్తకం

ఆనాటి పరిస్థితుల్ని యువతకు అవగాహన కల్పించాలని కోరారు. చీకటి రోజులను సోషల్ మీడియా ద్వారా పంచుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో 1975 నుంచి 1977 వరకు చీకటి రోజులుగా మోడీ అభివర్ణించారు. ఆనాటి పరిస్థితులపై మోడీ తొలి రాజకీయ జీవితంపై బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ 'ది ఎమర్జెన్సీ డైరీస్-ఇయర్స్ దట్ ఫోర్జ్డ్ ఎ లీడర్' పేరుతో కొత్త పుస్తకాన్ని ఆవిష్కరించింది. మోడీ వ్యక్తిగత జీవితం..రాజకీయ ప్రస్థానం..రాజకీయ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించడం లో.. ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో మోడీ పాత్ర ఏంటన్న విషయాలు ఈ పుస్తకంలో పొందిపరిచారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయంలో ఎమర్జెన్సీని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తగా మోడీ ఎలా ఎదుర్కొన్నారో.. వాటి గురించి వివరణాత్మకంగా పుస్తకంలో ఉన్నాయని బ్లూక్రాఫ్ట్ డిజిటల్ ఫౌండేషన్ వెల్లడించింది. ఇక మోడీతో సన్నిహితంగా మెలిగిన వ్యక్తుల అభిప్రాయాలను కూడా ఇందులో పొందిపరిచారు. దేశంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి గురించి ఇలా పుస్తకం ముద్రించడం మొదటి ప్రయత్నంగా పేర్కొంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో వెలుగులోకి కొత్త విషయాలు

ఏకంగా 4013 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసినట్లుగా ప్రణీత్ రావు అండ్ టీమ్ అంగీకరించారు. అందులో 618 మంది పొలిటికల్ లీడర్ల ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు తెలుస్తోంది. 618 మందిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ , పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు, బండి సంజయ్ ఆయన కుటుంబ సభ్యులు, ఈటెల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల ఫోన్లు కూడా ట్యాప్ చేసినట్లు గుర్తించారు. త్వరలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం , మర్రి శశిధర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్ రెడ్డి , మర్రి జనార్ధన్ రెడ్డి, తాటి కొండ రాజయ్యలకు సిట్ నోటీసు ఇవ్వనుంది. ఐఏఎస్‌లు రోనాల్డ్ రాస్, గౌతంల ఫోన్లు కూడా ట్యాపింగ్ అయ్యాయి. మొత్తం 618 మంది స్టేట్‌మెంట్లను కూడా పోలీసులు రికార్డ్ చేయనున్నారు. ఇప్పటి వరకు 228 మంది స్టేట్‌మెంట్ రికార్డింగ్‌లు పూర్తి అయ్యాయి. ఇప్పటి వరకు కేవలం 2023 నవంబర్ నెలకు సంబంధించిన ఫోన్ ట్యాపింగ్ డాటా మాత్రమే విచారణ అధికారుల వద్ద ఉంది. మిగిలిన డాటా మొత్తం కూడా ధ్వంసం అయిన విషయం తెలిసిందే. 618 మంది ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి ఆధారాలను బట్టి ఇప్పటి వరకు 228 మంది స్టేట్‌మెంట్లను రికార్డు చేయగా.. మరికొంత మంది స్టేట్‌మెంట్లను కూడా రికార్డు చేయనుంది సిట్. ఇంతటి సంచలనమైన కేసును సీబీఐకు అప్పగించాలని, సీబీఐ విచారణలోనే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ కేసులో ఎవరి పాత్ర ఉన్నా వదిలిపెట్టేది లేదని, విచారణలో ఎవరి ప్రమేయం ఉన్నా అరెస్ట్ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అయితే ఇప్పటి వరకు అధికారుల వరకు మాత్రమే విచారణ, అరెస్టులు జరుగగా.. అధికారుల వెనక ఉన్న అప్పటి బీఆర్ఎస్ నేతలు ఎవరనేది మాత్రం దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది. మరోవైపు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ లీగల్ సెల్ చైర్మెన్ దేవరాజు గౌడ్‌కు సిట్ బృందం నుంచి ఫోన్ వచ్చింది. దీంతో ఈరోజు బుధవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, ఆయన పీఏ కరుణాకర్ రెడ్డి, డ్రైవర్ అశోక్, కాంగ్రెస్ నాయకులు అరవింద్ సిట్ ముందు వాంగ్మూలం ఇవ్వనున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో పలుమార్లు గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఇంటిపై పోలీసుల రైడింగ్ కూడా జరిగింది.

## సెప్టెంబర్ 30లోపు పంచాయతీ ఎన్నికలు

దీనితో, 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై పడనుంది. స్థానిక పాలన లోపిస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు లేని పాలన వల్ల గ్రామీణాభివృద్ధి ఇబ్బందిగా మారుతుందని పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలలో నూతన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, పథకాల అమలు జాప్యం కావడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు కోర్టుకు విన్నపించుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. గ్రామపంచాయతీ ఎన్నికలు 3 నెలల్లో నిర్వహించాలని, 30 రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు 2024 జనవరి 30వ తేదీతో ముగిసినా ఎన్నికల నిర్వహణలో జాప్యం ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించక పోవడాన్ని సవాలు చేస్తూ పలువురు మాజీ సర్పంచులు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ టి.మాధవిదేవి తీర్పు ఇచ్చారు. తొలుత పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు. గతేడాది జనవరి 31తో సర్పంచుల పదవీ కాలం ముగిసినా.. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోంది. సర్పంచులను తప్పించి పంచాయతీల బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అప్పగించింది. ఇది రాజ్యాంగ, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధం. ప్రత్యేక అధికారులు ఇతర విధుల్లో ఉండటంతో ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా నిధులు సమకూరు స్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీతో పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులు అందక ఇబ్బందులుపడుతున్నారు. వివిధ పథకాల కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రావడంలేదు. వెంటనే ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పాత సర్పంచులకే బాధ్యతలు అప్పగించాలి' అని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ఎన్నికల నిర్వహణపై గతంలో ఒకసారి హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇది పూర్తికాగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఆమోదం తెలిపాక.. ప్రక్రియ పూర్తి చేయడానికి రెండు నెలల సమయం పడుతుందన్నారు. దీనిపై న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ సకాలంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎన్నికల సంఘం చొరవ తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినందున... ఆ దిశగా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. న్యాయవాది సమాధానమిస్తూ.. రిజర్వేషన్ల ఖరారుతో పాటు ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి మూడు నెలల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

## సమాజం నుంచి డ్రగ్స్‌ను దూరం చేయాలి

హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సినీ హీరో నిఖిల్ హాజరయ్యారు. డ్రగ్స్ వాడకంపై వ్యతిరేకంగా మంత్రులు, టీజీ న్యాబ్ ఉన్నతాధికారులు షార్ట్ ఫిలింను రిలీజ్ చేశారు. అలాగే డ్రగ్స్ నివారణపై పోస్టర్లను మంత్రులు విడుదల చేశారు. ఈ సంద్భంగా పొన్నం మాట్లాడుతూ.. డ్రగ్స్ ఎవరు తీసుకున్నా ప్రభుత్వానికి , పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కొద్ది రోజుల క్రితం తెలంగాణ పోలీసులు గోవా వెళ్లి డ్రగ్స్ ముఠా చైన్ కూడా బ్రేక్ చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ అమ్మేవారిని సమాజం నుంచి బహిష్కరించాలన్నారు. మాదక ద్రవ్యాలు తెలంగాణలో కనబడవద్దు అనే నినాదంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రపంచంలో తెలంగాణ పోలీస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. డ్రగ్స్ నివారణపై పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. డ్రగ్స్ నివారణే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని మంత్రి కోరారు. వారం రోజుల పాటు డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కోవిడ్ తర్వాత , కోవిడ్ సమయంలో లాక్ డౌన్ ఎఫెక్ట్‌తో యువత నిర్బంధానికి గురి అయ్యారని.. ఆ సమయంలో ఫ్రెండ్స్ గ్రూప్స్‌గా ఏర్పడి డ్రగ్స్‌కు అలవాటు పడ్డారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డ్రగ్స్ నివారణపై చాలా సీరియస్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ నివారణపై ప్రతీసారి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డ్రగ్స్ అమ్మేవారిని, రవాణా చేసేవారిని గుర్తించి అరెస్ట్ చేస్తున్నామన్నారు. డ్రగ్స్‌కు బానిస అయిన విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. 7, 8 తరగతి స్టూడెంట్స్ కూడా డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నారని తెలిపారు. డ్రగ్స్ కంట్రోల్ చేస్తున్న లిస్ట్‌లో తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని సీపీ ఆనంద్ వెల్లడించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటే జీవితం సంతోషంగా ఉంటుందని సినీ హీరో నిఖిల్ అన్నారు. చిన్నపుడు నుంచి సిగరెట్, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం వల్లే తన జీవితం సంతోషంగా ఉందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. జీవితంలో హీరో, డాక్టర్, యాక్టర్, సైంటిస్ట్ అవ్వాలి అంటే ముందుగా ఆరోగ్యంగా ఉండాలని హీరో నిఖిల్ పేర్కొన్నారు. కాగా.. ఈ కార్యక్రమానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ , మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు వివిధ కళాశాల విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# అంగుష్టమాత్రుడితో అపర భగీరథుడికి పోలికా..?




## ఏ బేసిన్ ఎక్కడుందో రేవంత్‌కు తెలుసా..? : నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్,జూన్25 : అంగుష్టమాత్రుడితో..అపర భగీరథుడు కేసీఆర్‌కు పోలికా.. అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఏ బేసిన్ ఎక్కడుందో తెలియదు.. దేవాదుల ఎక్కడుందో తెలియదు.. మరి కేసీఆర్ వచ్చి మీకు ఏం చెప్పాలి. తెలంగాణ ప్రాజెక్టులు, కేంద్రం తీరుపై నిండు శాసనసభలో కేసీఆర్ సమూలంగా వివరించారు.. అప్పుడు నీవున్న పార్టీ సభ నుండి పారిపోయిందని ఎద్దేవా చేశారు. మీరు లేవనెత్తే అంశాలకు శాసనసభలో ఉన్న కేటీఆర్, హరీష్ రావు లేదా గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్ రెడ్డిలు సమాధానం ఇస్తారు.. వారు చెప్పే అంశాలకు ప్రజలు కన్విన్స్ అవుతారో లేదో చూద్దాం. మీరు ఎన్ని గంటలు మాట్లాడతారో.. దమ్ముంటే వీళ్లకు కూడా అంతే సమయం మైక్ కట్ చేయకుండా ఇవ్వండి అని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ కూలి ఎనిమిది మంది మరణించారు.. వారి శవాలను బయటకు తేలేకపోయారు అయినా మీకు సిగ్గు లేదు. కాళేశ్వరంలోని మేడిగడ్డలో కేవలం రెండు పిల్లర్లు కుంగితే వాటిని బాగు చేయకుండా కాళేశ్వరం కూలేశ్వరం అని అంటారా కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం అని చెబితే రాష్ట్రంలో బడి పిల్లలకు కూడా అర్థం అయింది కానీ.. రేవంత్ రెడ్డికి అర్థం కాకుంటే మేము ఏం చేస్తాం.. తెలంగాణ ప్రాజెక్టులకు నీటి లభ్యత లేదు అని అనేకమార్లు చంద్రబాబు నాయుడు కేంద్రానికి లేఖ రాశాడు.. మరి ఇప్పుడు ఏపీ ప్రాజెక్టులకు నీళ్లు ఎక్కడి నుండి వస్తాయి..? కేంద్రం ఎందుకు వివక్ష చూపుతుంది.. అకారం కోసం ఆంధ్రప్రదేశ్‌కు అనుమతులు ఇస్తారా? పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి హైడ్రాలజీ అనుమతి తప్ప అన్నీ ఉన్నాయి.. పాలమూరు రంగారెడ్డికి నీటి కేటాయింపులు లేవని కేంద్రం డీపీఆర్ వెనక్కు పంపింది.. మరి సీఎం ఏం చేస్తున్నాడు.. అని నిరంజన్ రెడ్డి నిలదీశారు. విభజన చట్టం ప్రకారం కొత్తగా ఏ ప్రాజెక్టు కట్టినా అపెక్స్ కౌన్సిల్ సమావేశం అనుమతి తీసుకోవాలని చెప్పింది.. కానీ అసలు సమావేశమే ఏర్పాటు చేయకుండా రూ.82 వేల కోట్లతో గోదావరి బనకచర్లకు అనుమతులు ఎందుకు కేంద్రం ఆ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చడం వెనక అసలు వ్యవహారం కేంద్రంలో చంద్రబాబు మద్దతు ఇవ్వడమే కారణం కాదా బనకచర్ల ప్రాజెక్టును కేంద్రం తిరస్కరించాలి.. దానికి ఎలాంటి అనుమతులు కేంద్రం ఇవ్వకూడదు. దానికి ఎలాంటి అనుమతులు వచ్చినా తెలంగాణకు శాశ్వత ప్రమాదం తప్పదు.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులను అడ్డుకోవాలి. కేసీఆర్ మీద, కాళేశ్వరం మీద మాట్లాడడం మానేసి బనకచర్ల అనుమతుల మీద కేంద్రంతో పోరాడాలి. ఒక్కసారైనా కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని సీఎం, మంత్రులు పూర్తిగా పరిశీలించారా అసలు నీళ్లు ఎలా పారుతాయో వీరికి తెలుసా అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలలో 90 శాతం పనులు పూర్తయ్యాయి.. కనీసం పది శాతం పనులు పూర్తి చేయకుండా ఎందుకు అడ్డుకుంటున్నారు.. పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూ ఎందుకు పూర్తి చేయడం లేదు. ఈ ప్రభుత్వం చివరిదశలో నీళ్లిచ్చి కేసీఆర్ పెండింగ్ పెడితే మేము పూర్తి చేశాం అని చెప్పుకునే ప్రయత్నంలో ఈ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. తండ్రి చనిపోతే దినవారాలకు నీళ్లు లేవని శాసనసభ సాక్షిగా రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు రికార్డులలో ఉన్నాయి.. ఆ దుస్థితికి కారణం కాంగ్రెస్ పార్టీనే.. అప్పుడు రేవంత్ తెలుగుదేశం పార్టీలో ఉన్నాడు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాంగ్రెస్ పార్టీ నీళ్లు ఇచ్చింది కేవలం 13 వేల ఎకరాలకే.. కేసీఆర్ హయాంలో దానిని 4 లక్షల ఎకరాలకు పైగా సాగునీళ్లు ఇచ్చాం.. కల్వకుర్తి ఎత్తిపోతలకు రూ.5789 కోట్లు ఖర్చయ్యాయి.. అందులో రూ.4 వేల కోట్లు కేసీఆర్ హయాంలోనే ఖర్చయ్యాయి. పైసలు ఖర్చు చేసిన ప్రతిసారీ కాంగ్రెస్ మీద బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ అభాండాలు మోపలేదు.. సీఎం స్థానంలో ఉంటూ నిత్యం కేసీఆర్‌ను ఆడిపోసుకోవడం శోచనీయం. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమంలో కేసీఆర్ తనను నిత్యం దూషించిన వారిని కూడా అక్కున చేర్చుకున్నారు.. అది నిజమైన నేతల లక్షణం అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

## రైతు భరోసా ఎందుకు సంబరాలు : డీకే అరుణ

హైదరాబాద్, జూన్25 : స్థానిక సంస్థలకు వెళ్లే ధైర్యం కాంగ్రెస్‌కి లేదని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. రెండు ఎకరాలు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇంకా రాలేదని.. అలాంటప్పుడు రైతు భరోసా పేరుతో సంబురాలు ఎందుకు చేసుకుంటున్నారో కాంగ్రెస్ నేతలకే తెలియదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీజేపీ నాయకులందరూ బాధితులేనని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని నిలదీశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలని కోరారు. బుధవారం నల్లగొండలో ఎంపీ డీకే అరుణ పర్యటించారు. బీజేపీ నేతలతో పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. జూన్ 25వ తేదీ దేశ చరిత్రలో చీకటి రోజని తెలిపారు ఎంపీ డీకే అరుణ. ఎమర్జెన్సీ పేరుతో కాంగ్రెస్ చేసిన అరాచకాల గురించి ప్రజలందరికీ తెలియాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆనాడు పేదలపై అరాచకాలు చేశారని.. ఈనాడు సామాజిక న్యాయం అంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తన అజెండాను దేశంపై రుద్దేందుకు రాజ్యాంగ సవరణలు చేపట్టిందని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగం గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రపంచ వ్యాప్తంగా లభిస్తోన్న ఖ్యాతిని చూసి రాహుల్ గాంధీ ఓర్వలేక పోతున్నారని ధ్వజమెత్తారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత శక్తి ఏంటో పాకిస్థాన్‌కి చూపించామని తెలిపారు. ప్రధానిని విమర్శించే సీఎం రేవంత్‌రెడ్డి ఎమర్జెన్సీ గురించి ముందుగా మాట్లాడాలని ఎంపీ డీకే అరుణ హితవు పలికారు.

### లబ్ధిదారుల నుంచి లంచం తీసుకునే దారిద్ర్యం నాకు లేదు : జమీర్‌అహ్మద్‌ఖాన్

బెంగళూరు, జూన్25 : పేదలకు కేటాయించే ఇళ్ల లబ్ధిదారులనుంచి లంచం తీసుకునేంతటి దరిద్రం తనకు రాలేదంటూ.. గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్‌అహ్మద్‌ఖాన్ మండిపడ్డారు. బెంగళూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లబ్ధిదారుల నుంచి తాను లంచం తీసుకున్నట్టు నిరూపిస్తే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తానన్నారు. తన శాఖలో అవినీతికి తావు లేదన్నారు. ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఆరోపణలపై విచారణ జరుపుతామని, ఎమ్మెల్యేతోనూ మాట్లాడతానన్నారు. బీఆర్ పాటిల్ ఎక్కడా మంత్రి లంచం తీసుకున్నారని ఆరోపించ లేదన్నారు. ఏ పంచాయతీలోనైనా అటువంటి సంఘటన జరిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ఎమ్మెల్యే బేళూరు గోపాలకృష్ణ తన రాజీనామా కోరారని, అయితే లంచం తీసుకున్నట్లు నిరూపిస్తే తానే పదవి వదులకుంటానన్నారు. అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

## డ్రగ్ కేసులో మాజీ మంత్రి అరెస్టు

పంజాబ్, జూన్25 : పంజాబ్ రాష్ట్రానికి సంబంధించిన 2021 నాటి డ్రగ్స్ కేసులో శిరోమణి అకాలీదళ్ సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియా అరెస్టయినట్లు తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు అమృత్‌సర్‌లోని మజీతియా నివాసంలో ఆకస్మిక సోదాలు చేశారు. విక్రమ్ మజీతియా శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు సొంత బావ. ఆయన గతంలో పంజాబ్ రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య గనీవే కౌర్ మజీతియా ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 నాటి డ్రగ్స్ కేసులో విక్రమ్ మజీతియా నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్.. మజీతియాకు, ఆయన కుటుంబానికి సంబంధించిన కంపెనీల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. ఈ క్రమంలో ఇవాళ విజిలెన్స్ బ్యూరో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మజీతియా ఇంటిపైకి రైడింగ్‌కు రావడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ సందర్భంగా మజీతియా, మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కేసులో ఎవరినైనా అరెస్ట్ చేశారా..? అన్న ప్రశ్నకు అమృత్‌సర్ ఆర్పీఎస్ సంధూ అవునని చెప్పారు. అరెస్టయిన వాళ్లను ఇక్కడ నుంచి తీసుకెళ్లామని తెలిపారు. ప్రస్తుతం ఇంట్లో సోదాలు జరుగుతున్నాయని అన్నారు.

## తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

హైదరాబాద్, జూన్25 : తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు, ఊహించని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఈ కేసులో ప్రధాని నిందితుడైన బ్యాంక్ మేనేజర్ తిరుమలరావును పోలీసులు బుధవారం శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. గద్వేల్‌కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్‌ను పెళ్లైన నెల రోజులలోపే భార్య ఏకంగా ఐదు సార్లు హత్య చేసేందుకు ప్రయత్నించింది. ఫైనల్‌గా ఆరోసారి ఆమె అనుకున్నది సాధించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన తేజేశ్వర్ భార్య ఐశ్వర్య.. నెల రోజుల క్రితం తేజేశ్వర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. కానీ, అంతకంటే ముందు ఐశ్వర్యకు కర్నూల్‌లోని ఓ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుమలరావు అనే వ్యక్తితో సంబంధం ఉంది. తిరుమలరావు పనిచేసే బ్యాంక్‌లో ఐశ్వర్య తల్లి పనిచేసేది. ఈ క్రమంలోనే ఆమెకు, బ్యాంక్ మేనేజర్ తిరుమలరావుకు శారీరక సంబంధం ఏర్పడింది. ఆ తర్వాత తిరుమలరావుకు ఐశ్వర్యతో కూడా పరిచయం అయింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. తిరుమలరావుకి అప్పటికే వివాహం అయినా అతనికి పిల్లలు లేరు. దీంతో.. ఐశ్వర్యను రెండో వివాహం చేసుకోవాలని తిరుమలరావు భావించాడు. అందుకే ఐశ్వర్య కూడా ఒప్పుకుంది. ఇలా ఏకకాలంలో తల్లీ కూతుళ్లతో తిరుమలరావు సంబంధం కొనసాగించాడు. కానీ, గద్వేల్‌కు చెందిన సర్వేయర్ తేజేశ్వర్‌ను ఐశ్వర్య పెళ్లి చేసుకుంది. కానీ పెళ్లైన కొన్ని రోజులకే తిరుమలరావుతో ఐశ్వర్య మళ్లీ టచ్‌లోకి వెళ్లింది. ఎలాగైనా తేజేశ్వర్‌ను వదిలించుకొని నీతో వచ్చేస్తానంటూ అతనికి చెప్పింది. దీంతో తిరుమలరావు, ఐశ్వర్య కలిసి తేజేశ్వర్ హత్యకు ప్లాన్ వేశారు. తిరుమలరావు తేజేశ్వర్‌ను హత్య చేసేందుకు కొంత మందికి 75 వేల సుపారీ ఇచ్చాడు. అతడి వద్ద డబ్బు తీసుకున్నవారిలో ప్రధాన నిందితుడైన మనోజ్ అనే వ్యక్తి. తేజేశ్వర్ సర్వేయర్ కావడంతో సర్వే పేరుతో అతణ్ని బయటకు తీసుకెళ్లాడు. ఈనెల 17న తేజేశ్వర్ ను ల్యాండ్ సర్వే పేరుతో నగేష్, పరశురాం, రాజు అనే ముగ్గురు వ్యక్తులు ఇంట్లోంచి బయటకు పిలిచారు. కారులో ఎక్కించుకొని తీసుకెళ్లారు. ముందు సీట్లో కూర్చున్న తేజేశ్వర్ మెడ పట్టుకొని రాజు, పరశురామ్ కత్తితో పొడిచారని తెలిపారు పోలీసులు. ఆ తరువాత డ్రైవర్ సీట్లో ఉన్న నగేష్ తేజేశ్వర్ కడుపులో కత్తితో పొడిచాడన్నారు. చనిపోయిన తరువాత కర్నూలు శివారులో మృతదేహాన్ని పడేశారు. డెడ్‌బాడీని చూసిన తరువాత సుపారీ బ్యాచ్ కి రూ.2లక్షలు ఇచ్చాడు తిరుమలరావు. మర్డర్‌కు ముందు బ్యాంక్ నుంచి తిరుమలరావు రూ.20 లక్షల లోన్ తీసుకున్నాడు. ఆ హత్య తరువాత ఐశ్వర్యతో కలిసి లడఖ్ వెళ్లేందుకు తిరుమలరావు ప్లాన్ వేసుకున్నాడు. అయితే తేజేశ్వర్ కనిపించడం లేదంటూ అతని తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని.. తేజేశ్వర్ ఫోన్ లోకేషన్ ఆధారంగా గద్వేల్ పోలీసులు కర్నూల్‌కు వెళ్లి ఓ చెరువు వద్ద తేజేశ్వర్ మృతదేహాన్ని కనిపెట్టారు. మృతదేహంపై అమ్మ అనే పచ్చబొట్టు ఆధారంగా అది తేజేశ్వర్ మృతదేహంగా ని

## కేసీఆర్ దమ్ముపై మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదు : కవిత




హైదరాబాద్,జూన్25 : మాజీ సీఎం కేసీఆర్ దమ్ము గురించి మాట్లాడే అర్హత సీఎం రేవంత్‌రెడ్డికి లేదని.. ఆయన దమ్మేంటో కాంగ్రెస్ పెద్దలకు తెలుసునని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళలకు రూ. 2500, పెన్షన్ల మొత్తం పెంపుపై ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంపై అసెంబ్లీలోనే చర్చిద్దామన్నారు. రేవంత్ రెడ్డి చంద్రబాబును పిలిచి హైదరాబాద్ బిర్యాని పెట్టి గోదావరి నీళ్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. 2016లో పోలవరం, బనకచర్ల అంశమే లేదు. రేవంత్ రెడ్డికి అబద్దాలు ఆడడం అలవాటైంది. గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించడం సరికాదు. యస్.. అసెంబ్లీ పెడుదాం ఆరు గ్యారెంటీల అమలు, మహిళలను మోసం చేసినదానిపై చర్చిద్దామన్నారు కవిత. రేవంత్ రెడ్డి హుందాగా వ్యవహరించాలి. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీని ప్రజలు క్షమించరు అని కవిత పేర్కొన్నారు. ఇక ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు రాశారు. అబిడ్స్ జీపీవోలో ఎమ్మెల్సీ కవిత, జాగృతి కార్యకర్తలు పోస్ట్ కార్డులను పోస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. వృద్ధులకు రూ. 2 వేల పెన్షన్‌ను, రూ. 4 వేలు చేస్తామన్న హామీని కాంగ్రెస్ విస్మరించింది. వికలాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పెంచకుండా కాంగ్రెస్ మోసం చేసింది. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైంది..? గ్యారెంటీలపై సోనియా గాంధీ సంతకం పెట్టిన గ్యారెంటీ కార్డులను ఇంటింటికి పంచారు. సోనియాగాంధీ ముఖం చూసి ఓట్లేసిన మహిళలను, వృద్ధులను, వికలాంగులు మోసం చేశారు. అందుకే సోనియా గాంధీకి వేలాది పోస్టు కార్డులు పంపించాము. పెన్షన్ల మొత్తాన్ని పెంచాలని రేవంత్ రెడ్డికి ఆదేశాలివ్వాలని సోనియా గాంధీని కోరామని కవిత పేర్కొన్నారు.

## బనకచర్ల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదు

### సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్

సిద్దిపేట,జూన్25 : బనకచర్ల ప్రాజెక్ట్ గురించి కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి 18 నెలల పాలన చూశాక కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో ప్రజలకు అర్థమైందని చెప్పారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి, కావాలని ప్రజలు అంటున్నారని తెలిపారు. మళ్లీ పదేళ్ల దాకా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకుండా రేవంత్‌రెడ్డి చేశారని అన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే నిర్వహించడం లేదని ఆరోపించారు. బుధవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం యూత్ కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ బీఆర్ఎస్‌లో చేరారు. ప్రశాంత్ పాటిల్‌కి హరీష్‌రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హరీష్‌రావు వెంట ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. అబద్దాల్లో సీఎం రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పోటీపడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ బహిరంగ చర్చకు పోదామని అంటున్నారని.. ఎక్కడికి రమ్మంటారో చెప్పాలని.. తాను సిద్ధమని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రతి సవాల్ విసిరారు. ఏ టీవీలో కూర్చుందామో, ఎక్కడ మాట్లాడుదామో చెప్పు తాను రెడీ... రేవంత్‌రెడ్డి వస్తారో, మహేష్ కుమార్ గౌడ్ వస్తారో చెప్పాలని ప్రతి సవాల్ చేశారు. అసెంబ్లీ నిర్వహించడం చేతగాక రేవంత్‌రెడ్డి పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. వారం రోజులకు మించి అసెంబ్లీ నడిపే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. మళ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలిచేది కేసీఆర్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

## అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి

హైదరాబాద్,జూన్25 : ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు, మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేటలో ప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశాన్ని కాలుష్యరహితంగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారని, మన ఇంటికి ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అడవులు రోజురోజుకు అంతరించి పోతున్నాయని దానివల్ల వర్షాలు తగ్గడమే కాకుండా సూర్యతాపం మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి బీజేపీ కన్వీనర్ శ్రీకర్‌రావు, పద్మయ్య, ఎర్రస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జానకి, లీగల్‌సెల్ సద్గుణరెడ్డి, రవిగౌడ్, రేవతి, శోభరాజన్ తదితరులు పాల్గొన్నారు.

## మెట్రో రైలులో పొగ.. ప్రయాణికులకు ఇబ్బందులు

ముంబై, జూన్25 : మెట్రో కోచ్‌లోకి దట్టమైన పొగ రావడంతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఊపిరాడక దగ్గుతో విలవిల్లాడారు. ముఖాలకు అందుబాటులో ఉన్న క్లాత్‌లు, మాస్కులు అడ్డుపెట్టుకున్నారు. ఏం జరుగుతోందో తెలియని అయోమయం, గందరగోళం చెలరేగింది. ముంబై బోరివలి ఏరియాలోని దేవిపద మెట్రో స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వెస్ట్రన్ ఎక్స్‌ప్రెస్ హైవేపై ఒక ప్రైవేటు బస్సు మంటల్లో చిక్కుకోవడం, అదే సమయంలో దేవిపద మెట్రో స్టేషన్‌లో రైలు ఆగడంతో పొగలు ఒక్కసారిగా కోచ్‌లోకి ప్రవేశించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. సంఘటన వివరాల ప్రకారం, దేవిపద మెట్రో స్టేషన్‌కు పక్కనే ఆపి ఉన్న ఖాళీ బస్సు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుంది. దీంతో మెట్రో సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను చల్లార్చడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే, మెట్రో స్టేషన్ కిందనున్న రోడ్డుపై బస్సు పార్కింగ్ చేసి ఉండటంతో దట్టమైన పొగలు వెలువడ్డాయి. అదే సమయంలో మెట్రో రైలు ఆగడం, తలుపులు తెరుచుకోవడంతో ఒక్కసారిగా పొగలు కోచ్‌లోకి ప్రవేశించాయి. యోగేష్ నామ్‌జోషి అనే ప్రయాణికుడు ఇందుకు సంబంధించిన 50 సెకన్ల వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు వీడియోను ట్యాగ్ చేశాడు. ఈ ఘటనపై మహా ముంబై మెట్రో ఆపరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విచారం వ్యక్తం చేసింది. రైలులో అగ్నిప్రమాదం కానీ, ప్రమాదం కానీ జరగలేదని తెలిపింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్టు పేర్కొంది.

## హైకోర్టు తీర్పు మేరకు స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

### ఇంతకాలం ఎన్నికలు దాటవేయడం సరికాదు

### బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్ డిమాండ్




న్యూఢిల్లీ,జూన్25 : తెలంగాణ హైకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థల ఎన్నికలను రేవంత్ ప్రభుత్వం నిర్వహించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీలోగా నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టకుండా రేవంత్ సర్కార్ చోద్యం చూస్తోందని విమర్శించారు. బుధవారం ఢిల్లీ వేదికగా మీడియాతో బీజేపీ ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. సర్పంచ్‌ల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేశారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ గుర్తుచేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, తప్పించుకోవద్దని అన్నారు. పార్టీల పరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రేవంత్‌రెడ్డి అనడం బీసీలను మోసం చేయడమేనని విమర్శించారు. కులగణన పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అన్నారు. తూతూమంత్రంగా బీసీ కులగణన చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 2 వేల కోట్ల నిధులు ఆగిపోయాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. తెలంగాణ కులగణనలో 90 శాతం ముస్లింలను బీసీల్లో చేర్చి, నిజమైన బీసీలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు అమ్మకుండా చూడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల భూములను వెనక్కి అడుగుతున్న తెలంగాణ ప్రభుత్వం వాటిని అమ్మాలని భావిస్తుందా అని నిలదీశారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వం భూముల అమ్మకాన్ని మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర పూర్తి అయిందని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ తాను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి జరిగి ఉండొచ్చని.. తాను అప్పుడు పెద్దగా పట్టించుకోలేదని అన్నారు. ఫార్ములా ఈ రేసు, ఫోన్ ట్యాపింగ్ కేసులు ఏడాది కాలం నుంచి సాగదీస్తున్నారని విమర్శించారు. అసలు ఈ కేసులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా అని ప్రశ్నించారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఈ ఫార్ములా రేస్ కేసులను సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## అప్రకటిత ఎమర్జెన్సీలో మన ప్రజాస్వామ్యం!

ఎమర్జెన్సీ చీకటి రోజులు పోయాయి. 50 ఏళ్ల క్రితం నాటి ఘటనలు తలచుకుంటూ నాటి ప్రధాని ఇందిరను దునుమాడుతున్నారు. అప్పటికీ ఇప్పటికీ పెద్దగా తేడా కనిపించడం లేదు. ఎమర్జీన్సీలో లేము అన్నదే కనిపిస్తుంది తప్ప..ప్రజలు అప్రకటిత ఎమర్జెన్సీలో కాలం గడుపుతున్నారు. ప్రస్తుత పాలకుల్లో ఇది బాగా కనిపిస్తోంది. పార్లమెంటులో సమస్యలపై చర్చ ఉండదు. వారు తీసుకున్న నిర్ణయాలే అమలవుతాయి. ఇష్టానుసారం ఎన్‌కౌంటర్లతో నక్సల్స్‌ను తుదముట్టించే నిరంకుశ విధానం నడుస్తోంది. అర్బన్ నక్సల్స్ పేరుతో మేధావులు గళమెత్తకుండా చేస్తున్నారు. విమర్శలను తట్టుకునే స్థితిలో నేటి పాలకులు లేరు. విపక్షాలు కూడా అధికారమే పరమావధిగా ఎత్తులు వేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇదో గేమ్. ధరలు తగ్గించాలని అడగవద్దు, ఉద్యోగాలు కావాలని రోడ్డెక్కవద్దు. చదువులు కావాలని కోరుకోవద్దు. మంచి ఆరోగ్యం కావాలని డిమాండ్ చేయవద్దు. జిఎస్టీ వాతలు తగ్గించాలని ఎలుగెత్తకూడదు. వారి దయా దాక్షిణ్యాల మేరకు బతకాల్సిన దుస్థితిలో భారత ప్రజాస్వామ్యం నడుస్తుందని గుర్తించాలి. పాలకులు మాత్రమే మంచి జీవితం గడుపుతున్నారు. విమానాల్లో తిరుగుతున్నారు. ప్రజలు మాత్రం నేటికీ అర్థాకలి, నిరుద్యోగం తదితర సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎమర్జెన్సీని నిందిస్తూ మనం సాధించిన ప్రగతి ఏమిటో నేతలు చర్చించాలి. నేటికీ అధికార పక్షం, విపక్షం తమకు తోచిన విధంగా నిరంకుశ విధానాలే అవలంబిస్తున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. అందుకే ప్రస్తుతం దేశంలో కొత్తగా చీకటి రోజులు తాండవిస్తున్నాయి. నేతలు తమ నిరంకుశ విధానాలతోనే నేటికీ రాజ్యమేలుతున్నారు. పేరుకే ప్రజాస్వామ్యంగా మనమంతా ఘనంగా చెప్పుకుంటున్నా.. స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేదు. స్వేచ్ఛగా మాట్లాడే పరిస్థితులు లేవు. ప్రభుత్వాలను విమర్శించే అవకాశం ఉండడం లేదు. ప్రభుత్వాలను విమర్శించే వేదిక లేకుండా పోయింది. పత్రికలు బాకాలుగా మారాయి. ప్రజా ఉద్యమాలను అణచివేయడంలో ఇందిరను మించి పోయారు. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ వల్ల కేవల రాజకీయ నాయకులే జైలుకు వెళ్లారు. ఇది తప్పే. ఎమర్జెన్సీ చీకటి రోజులను నిందించాల్సిందే. కేవలం తన పదవిని కాపాడు కునేందుకు ఇందిర ఎమర్జెన్సీ అస్త్రాన్ని ఉపయోగించింది. అయితే ఆనాడు మనమంతా గుర్తించని మరోకోణం కూడా ఒకటి ఉంది. ఎమర్జెన్సీలో వ్యవస్థలన్నీ పక్కాగా నడిచాయి. గ్రామస్థాయిలో కూడా ఆఫీసులు సమయానికి నడిచాయి. ఉద్యోగులు సక్రమంగా పనిచేశారు. లంచం పుచ్చుకోవాలంటేనే వణికిపోయారు. కల్తీల బెడద తొలగింది. నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉన్నాయి. బ్లాక్ మార్కెటీర్ల భరతం పట్టారు. వేళకు బస్సులు, ట్రైన్‌లు నడిచాయి. ఇన్ని మంచి పనులు జరిగినా ఇవన్నీ ఎప్పుడూ ప్రచారంలోకి రాలేదు. ఎందుకంటే ప్రచారకర్తలు రాజకీయ నాయకులే కనుక వీటి గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఈనాడు అలాంటి పరిస్థితి ఎందకు లేదో ప్రజలు చర్చించాలి. అందుకే ఆనాటి ఎమర్జెన్సీని తలదన్నేలా నేటి పాలకులు తమ విధానాలను కొనసాగిస్తున్నారు. యాభై సంవత్సరాల క్రితం 1975లో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 21 నెలల పాటు దేశంలో అత్యయికస్థితిని విధించారు. తనను వ్యతిరేకించిన నేతలను జైళ్లల్లో తోసారు. అడగడానికి వీలు లేకుండా చేశారు. ఇదంతా కేవలం పదవిని కాపాడుకునే ప్రయత్నం తప్ప మరోటి కాదు. నిజంగానే ఇందిర తీసుకున్న ఈ నిరంకుశ నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమించి జనతా పార్టీకి అంకురార్పణ చేశారు.ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి మహామహులంతా ఒక్కటిగా చేరి జనతా పార్టీగా అధికారం చేపట్టారు. మంచి నిర్ణయాలు తీసుకున్నారు. కానీ అది ఎంతో కాలం నిలవలేదు. ప్రధాని పదవికి పోటీపడిన వారంతా జనతాపార్టీని విచ్ఛిన్నం చేశారు. ఇలా జనతా సమయంలోనూ, తరవాత ఎన్టీఆర్ హయాంలోనూ ఇలాగే జరిరగింది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్‌ను స్థాపించి,దానిని అధికారంలోకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నించినా, అదికూడా ఎక్కువ కాలం నిలవలేదు. మనదేశంలో ప్రజాస్వామ్యం వల్ల రాజకీయ నేతలు బాగుపడ్డారే తప్ప ప్రజలు బాగుపడలేదని 78 స్వాతంత్ర్యం వల్ల తెలిసింది. కొన్ని కుటుంబాలే బాగుపడుతున్నాయి. ప్రతి ఎన్నికల్లో నూ ప్రజలు ఓడిపోతున్నారు. రాజకీయ నాయకులు గెలుస్తున్నారు. నిరంకుశం పైకి కనపించకుండా అప్రకటిత ఎమర్జెన్సీ విధానాలు కొనసాగిస్తున్నారు. ప్రధానంగా వారసత్వ రాజకీయాలదే పెత్తనంగా మారింది. మళ్లీమళ్లీ తామే గెలవాలన్న కుటిల వ్యూహంతో చేస్తున్న విన్యాసాలు, పథకాలు, ప్రయత్నాలు దేశాన్ని పురోగమించడానికి అడ్డుపడుతున్నాయి. భారతదేశం బ్రిటిష్ వలస పాలన సంకెళ్లను తెంచుకున్న తర్వాత, మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ రూపంలో తీవ్రమైన ముప్పు ఎదురైందన్నది ముమ్మాటికీ నిజం. అంతకు ముందు అంటే బ్రిటిషర్ల కన్నా ముందు కూడా మొఘలులు, ఖల్జీలు, నిజాంలు ఇలా ఎందరో దేశాన్ని పాలించి భారత దేశాన్ని దోచుకున్నారు. బ్రిటిషర్లు కూడా దోచుకున్నారు. వీరంతా నిరంకుశంగానే దోచుకున్నారు. ఆ తరవాత స్వాతంత్రం ఉద్యమం జరిగి, దేశం ముక్కలుగా విభజించబడిన తరవాత దోపిడీ కొత్త రూపంలో ప్రవేశించింది. ఆనాడు రాజులు రాజ్యమేలితే ఇప్పుడు కుటుంబాలు రాజ్యమేలుతున్నాయి. నెహ్రూ వారసత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని కాంగ్రెస్ నేతలు నిత్యం స్మరిస్తూనే ఉంటారు. వందలాది ప్రతిపక్ష నేతలను, వేలమంది కార్యకర్తలను కారాగారాల్లో నిర్బంధించింది. పౌరహక్కులకు, ప్రాథమిక హక్కులకు ఎమర్జెన్సీ పాతరేసింది. భావప్రకటన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించివేసింది. శాంతియుతంగా నిరసనలు తెలియజేయడానికి కూడా ఎక్కడా ఎవరూ గుమిగూడడానికి వీల్లేకుండా చేసింది. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసింది. సెన్సార్‌షిప్ విధించింది. ఆఖరుకు న్యాయవ్యవస్థ స్వతంత్ర తకు కూడా క్లళెం వేయడానికి ప్రయత్నించింది. ఎమర్జెన్సీ ప్రకటించి ఇవన్నీ చేసిన ఇందిరనే మళ్లీ ప్రజలు ఎన్నుకున్నారు. ఆమె తనయుడినే మళ్లీ ప్రధానిగా ఎన్నుకున్నారు. ఇప్పుడు ఆయన తనయుడు రాహుల్ ప్రధాని కావాలంటూ కోసం శపథం తీసుకున్నారు. ప్రజలకు విద్య, వైద్యం అందించకుండా, కనీస వసతులు కల్పించకుండా చేస్తున్న పాలన కారణంగా ప్రజలు చైతన్యం కావడం లేదు. ఓటు బ్యాంక్ రాజకీయాల్లో ప్రజలు ఓడిపోతున్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో నిరంకుశ నేతలు రాజ్యమేలు తున్నారు. యాభై సంవత్సరాల క్రితం మన ప్రజాస్వామ్య వ్యవస్థ పునాదులను కదిలించిన అత్యయిక స్థితి నేటి తరానికి చరిత్ర. దీనిగురించి తెలుసుకోవాల్సిందే. నేడు జరుగుతున్న పాలనా తీరును కూడా చర్చించాలి. నిజానికి ఆనాడు జనతా పార్టీ విజయం అత్యయిక స్థితికి ముగింపు పలికింది. ప్రజాస్వామ్య విలువలు గెలిచాయి. ఆ చీకటి కాలం నుంచి మనం నేర్చుకున్న పాఠాలను భారతదేశ ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేయాలి. ఇది రాజకీయ నాయకుల వల్ల కాదని తేలిపోయింది. ప్రజాస్వామ్య సూత్రాలను కాపాడ టానికి, పౌర స్వేచ్ఛను రక్షించడానికి, అధికార సమతౌల్యం ఉండేలా పటిష్ఠమైన వ్యవస్థ మనగలగడానికి ప్రజలు గట్టిగా నిలబడాలి. అప్పుడే మనమంతా స్వేచ్ఛగా బతకగలం. పాలకులు కూడా ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయగలరు. ఎమర్జీన్సీని వ్యతిరేకిస్తూనే, రాజకీయ నేతల అప్రకటిత ఎమెర్జెన్సీ కార్యక్రమాలను నిదీయాలి. అప్పుడే దేశానికి మంచిరోజులు వస్తాయని గుర్తించాలి.

## ఇరాన్ పాశుపతాస్త్రం.. హర్మూజ్




ఇరాన్ ఇజ్రాయెల్ యుద్ధంలో అగ్రరాజ్యం అమెరికా ఊహించిన దానికన్నా ముందుగానే ప్రవేశించడమే కాకుండా ఇరాన్ అణుస్థావరాలపై భీకర దాడులకు దిగడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇంతవరకు ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పోరుగానే ఉన్న ఈ యుద్ధం ఇప్పుడు అమెరికా రంగప్రవేశంతో మూడో ప్రపంచ యుద్ధానికి లేదా అణుయుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందా అనే భయాలు వ్యక్తమవుతున్నాయి. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై దాడి చేసే విషయంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని చెప్తూ వచ్చిన ట్రంప్ ఆ ప్రకటన చేసిన రెండు రోజులకే హటాత్తుగా ఇరాన్ అణుస్థావరాలపై మెరుపుదాడులు చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ దాడి జరిగిన తర్వాత ఇరాన్ తమ అణుస్థావరాలపై దాడి చేయడం ద్వారా అమెరికా 'పెద్ద రెడ్‌లైన్'ను దాటేసిందని, దీనికి ఆ దేశం శాశ్వతమైన ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదని కూడా హెచ్చరించింది. ఇంతకీ భారత్– పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం సంభవించకుండా తానే చొరవ తీసుకుని ఇరుదేశాలను కాల్పుల విరమణకు అంగీకరింపజేశానని, నోబెల్ శాంతి బహుమతి తనకే దక్కాల్సి ఉందంటూ గొప్పలు చెప్పుకుంటూ వచ్చిన ట్రంప్ మహాశయుడు ఇప్పుడు తానే స్వయంగా ఇరాన్‌పై ప్రత్యక్ష దాడులకు దిగడం ద్వారా మరో భీకర యుద్ధానికి ఎందుకు తెరదీశారనేది ఎవరికీ అర్థం కాని ప్రశ్న. ఇరాన్ అణ్వస్త్రాలను సమకూర్చుకోకుండా చేయడం కోసమే తాము ఈ దాడి చేశామని ట్రంప్ చెప్పుకోవచ్చు కానీ అందులో పూర్తి నిజం లేదని ప్రపంచ దేశాలన్నిటికీ తెలుసు. ఎందుకంటే ఇరాన్ చాలా సంవత్సరాలుగా యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. అంతేకాదు, ఏ క్షణంలోనైనా అణ్వస్త్రాన్ని తయారు చేయగల స్థితిలో ఉందని అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సైతం అంటున్నాయి. అందుకే అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంలో చేరాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. ఈ దిశగా ఇరుదేశాల మధ్య ఆరేడు విడతలుగా చర్చలు కూడా జరిగాయి. ఈ దశలో ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసే విధంగా భీకర దాడులకు దిగడంతో ఆ అవకాశాలు చేజారినట్లే. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చట్టంనుంచి వైదొలగుతామని ఇరాన్ హెచ్చరించడమంటే తనకు నచ్చిన విధంగా అణు ఇంధనాన్ని శుద్ధి చేసుకోగలుగుతుంది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(%×త్వతీఅఫ్ఱశీఱుశ్రీ -శీఎఱఅ జుఅవతీస్త్రఎ -హాస్త్రవఅఎఎ%) (ఐఏఇఏ)వంటి సంస్థల పర్యవేక్షణను కూడా అనుమతించదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇరాన్ మరింత వేగంగా అణ్వాయుధాలను తయారు చేసుకునే అవకాశం లభిస్తుంది.అయితే ఇరాన్ అంతటి సాహసం చేసే స్థితిలో ఇప్పుడు ఉందా అనేదే ప్రశ్న. గతంలో ఇరాన్ ఇజ్రాయెల్ ఘర్షణల సమయంలో ఏ దేశం ఎటువైపు ఉందో స్పష్టంగా తెలిసేది. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. ఇరాన్‌పై అమెరికా దాడులను రష్యా, చైనాలు తీవ్రంగా ఖండించాయి. అయితే ఈ రెండు దేశాలు ఇరాన్‌కు నేరుగా సైనిక సాయం చేసే స్థితి లేదు. టర్కీ, ఖతార్, సౌదీఅరేబియా లాంటి గల్ఫ్‌దేశాల పరిస్థితి కూడా అలానే ఉంది. గతంలో ముస్లిం దేశాలన్నీ ఇరాన్‌కు అండగా నిలిచాయి. కానీ ఇప్పుడు అవి ప్రత్యక్షంగా ఇరాన్‌కు మద్దతుగా నిలిచేలా కనిపించలేదు. మరోవైపు భారత్ సహా పలు ఆసియా దేశాలు సైతం ఇరుపక్షాలకూ దూరంగా ఉంటున్నాయి. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సలహా ఇస్తున్నాయి. కానీ ఆ సలహాను అవి ఎంతమేరకు పాటిస్తాయనేది సందేహమే. ఇక ఇరాన్‌కు ఉన్న ఏకైక తురుపుముక్క హర్మూజ్ జలసంధిని మూసివేయడం. ప్రపంచంలో సముద్ర మార్గం ద్వారా రవాణా అయ్యే చమురులో 25 శాతం ఈ జలసంధి ద్వారానే సరఫరా అవుతుంది. కేవలం 33 కిలోమీటర్లు వెడల్పు ఉండే ఈ ఇరుకైన జలమార్గం గుండా వెళ్లే చమురు రవాణా నౌకలను అడ్డుకుంటే ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగిపోయే ప్రమాదం పొంచిఉంది. పెట్రోల్, డీజిల్ ధరల మంటలు ఎగసిపడితే ప్రపంచం ఆర్థికంగా దెబ్బతినడం ఖాయం. ఈ భయాలను బూచిగా చూపించి తమపై దాడులను ఆపాలని అమెరికా, ఇజ్రాయెల్ కూటమి దేశాలను ఇరాన్ హెచ్చరించే వీలుంది. మరో వైపు కువైట్, బహ్రెయిన్, ఖతార్, యుఎఇ వంటి గల్ఫ్ దేశాల్లోని అమెరికా వైమానిక స్థావరాలపై మెరుపుదాడులు చేసి ప్రతిదాడులను నిలువరించే అవకాశం ఉంది. ఈ భయంతోనే అమెరికా ఇప్పటికే ఒకటి, రెండు స్థావరాలనుంచి తమ యుద్ధవిమానాలను వేరే చోటికి తరలించినట్లు కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడం తమ లక్ష్యం కాదని, దాని అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ప్రధాన లక్ష్యమని అమెరికా, ఇజ్రాయెల్‌లు చెప్తూ ఉండడం గమనార్హం. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ చేతులనుంచి పాలనను తప్పించి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలనేదే అమెరికా ప్రధాన ఉద్దేశమని అంతర్జాతీయ విశ్లేషకులు అంటున్నారు. అన్నిటికన్నా మించి రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటినుంచి పలు వివాదాస్పద నిర్ణయాల ద్వారా ఇటు స్వదేశంలో, అటు ప్రపంచం దృష్టిలో బోలెడంత అపకీర్తిని మూటగట్టుకున్న ట్రంప్ మరింత దుందుడుకు చర్యలకు దిగుతారా? అన్నది ప్రధాన ప్రశ్న. ఓ వైపు రష్యా ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు గాజా సంక్షోభం సమస్యల్లో మధ్యవర్తిత్వానికి యత్నించి అవి ఫలించని నేపథ్యంలో ఈ రెండింటికన్నా క్లిష్టమైన ఇరాన్ ఇజ్రాయెల్ వివాదంలో తలదూర్చి కొరివితో తలగోక్కుంటారా? అయితే గతంలో ట్రంప్ పాలనను చూసిన చాలా మంది ఆయన సమస్యలను కొనితెచ్చుకోవడంలో సిద్ధహస్తుడని, ఇప్పుడు కూడా ఏమి చేస్తారో ఎవరూ ముందుగా ఊహించలేరని అంటున్నారు. అయితే పరిస్థితి అణుయుద్ధానికో, మూడో ప్రపంచ యుద్ధానికో దారి తీయకపోవచ్చని, అతి త్వరలోనే ఇరుపక్షాలు వాస్తవాన్ని అర్థం చేసుకుని ఓ అడుగు వెనక్కి వేస్తాయని మెజారిటీ విశ్లేషకుల అభిప్రాయం.

## రాయదుర్గంలో యువతి అనుమానాస్పద మృతి



హైదరాబాద్ : రాయదుర్గంలో ఓ యువతి ఓయో హొటల్లో యువతి సూసైడ్ చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... నల్లగండ్లలో నివాసం ఉంటున్న అనూష (26) బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. అనూషకు పెళ్లి జరిగినప్పటికీ భర్తతో విభేదాలు తలెత్తాయి. దీంతో భర్త నుంచి విడిపోయిన యువతి.. తల్లిదండ్రుల వద్దనే ఉంటోంది. వారిని చూసుకుంటూ బ్యూటీషియన్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈనెల 22న సాయంత్రం ఆరు గంటల సమయంలో స్నేహితుల వద్దకు వెళ్తున్నట్లు యువతి తల్లిదండ్రులకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. అయితే రాత్రి గడిచినప్పటికీ అనూష ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆమెకు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో యువతి కోసం గాలించడం మొదలుపెట్టారు. బంధువులను ఫోన్ చేసి అనూష గురించి ఆరా తీశారు. అయితే ఎవరూ రాలేదని చెప్పడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే రాయదుర్గంలోని క్యాబిన్ ఓయో లాడ్జ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది అనూష. ఈ విషయాన్ని ఓయో లాడ్జ్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా... వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే అనూష ఎందుకు సూసైడ్ చేసుకుందనే విషయం తెలియాల్సి ఉంది. యువతి మృతి విషయంపై తల్లిదండ్రులకు సమాచారం అందించారు పోలీసులు. కానీ యువతి ఆత్మహత్యపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. అసలు యువతి లాడ్జ్‌కు ఎందుకు వచ్చింది.. యువతితో పాటు ఎవరైనా వచ్చారా.. ఆత్మహత్యకు గల కారణాలు, యువతిది ఆత్మహత్యా లేక హత్యా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


## యువతకు ఆర్యజనని మంచి అవకాశం




హైదరాబాద్,జూన్25 : దివ్యమైన సంతానం కోరుకునే దంపతులకు రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మార్గనిర్దేశం చేస్తున్న ఆర్య జనని యువతకు స్కాలర్ షిప్పులు అందించేందుకు మరోసారి ముందుకు వచ్చింది. ఇందుకోసం18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జాతీయస్థాయి ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనుంది. స్వామి వివేకానంద ప్రాక్టికల్ వేదాంత, జ్ఞాన యోగ ప్రసంగాల ఆధారంగా రూపొందించిన నాలెడ్జ్ స్ట్రెంత్ అనే పుస్తకంపై టెస్ట్ నిర్వహించనుంది. మాక్ టెస్ట్ జూలై 20న జరగనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్యజనని వెబ్సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డాక్టర్ అనుపమ రెడ్డి తెలిపారు. మెయిన్ క్విజ్ ఆగస్టు మూడున జరగనుంది. విజేతలైన 150 మంది యువతీ యువకులకు ఆకర్షణీయ స్కాలర్షిప్పులు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8977863881 నెంబర్ కు వాట్సాప్ చేయాలని సూచించారు. హైదరాబాద్ రామకృష్ణ మఠం లోని వివేకానంద హెల్త్ సెంటర్‌లో సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యుల బృందం 2018 సంవత్సరంలో ఆర్యజనని ప్రారంభించింది. అనేక మంది ఉత్సాహవంతులైన, సేవాభావతత్పరులైన వైద్యులు, యోగా నిపుణులు, క్లినికల్ సైకాలజిస్టులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, గాయకులు ఆర్యజనని బృందంలో ఉన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా గత 5 సంవత్సరాలుగా, ఆర్యజనని సంస్థ, కాబోయే తల్లి తండ్రులకు "స్పృహతో కూడిన గర్భధారణ, పేరెంటింగ్" గురించి అవగాహన కల్పించే విధంగా ఆఫ్ లైన్, ఆన్ లైన్ వర్క్ షాప్ లు నిర్వహిస్తోంది. ఇది గర్భిణీ స్త్రీలు, వారి శిశువుల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన కార్యక్రమం. యోగా, ధ్యానం, బేబీ బాండింగ్ టెక్నిక్స్, ఆత్మీయ గానం, ప్రెగ్నెన్సీ లైఫ్ స్టైల్ తదితర అంశాలతో కూడిన ఈ 3గంటల వర్క్ షాప్ ఆధ్యాత్మికత, ఆధునిక విజ్ఞానంతో కూడిన అద్భుతమైన మేళవింపు. కడుపులో పెరుగుతున్న శిశువు యొక్క శారీరక, భావోద్వేగ, మేధోపరమైన, ఆధ్యాత్మిక ఉన్నతికి ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుంది.

## నిధి చాలా సుఖమా!

ధన దారేషు వృద్ధేషు దుఃఖం యుక్తం న తుష్టతా.. 'ధన దారాదులు వృద్ధి చెందితే దుఃఖించాలి కాని, సంతృప్తి చెందరాదు. మోహమాయ పెరిగితే ప్రపంచంలో ఎవనికి శాంతి కలుగుతుంది?' అని పై ఉపనిషత్ వాక్య భావం. ధనదారాదులంటే డబ్బు, భార్యా పిల్లలు మొదలైనవి. ఇవి పెరిగే కొద్దీ సమస్యలే తప్ప మనశ్శాంతి లభించదు కదా! ధనం పట్ల ఏ రకమైన యావ లేని మహానుభావుని జీవిత వృత్తాంతం ఒకటి ఈ సందర్భంగా తెలుసుకుందాం. తంజావూరు దగ్గర 'తిరువయ్యూరు గ్రామంలో ఒక భిక్షుకుడు చిరుతలు వాయిస్తూ పాడుతున్నాడు. చేతిలో తంబురా.. వీపున పాత్ర ఉన్నవి. గృహస్తులు భిక్ష వేస్తున్నారు. ఈ లోపల ఆ పాత్రలో ఒక బ్రాహ్మణుడు బియ్యం వేశాడు. భిక్షుకుడు వెంటనే వణికిపోయాడు. ఎందుకంటే బియ్యంతోపాటు అందులో బంగారు నాణేలు ఉన్నాయి. అది చూసి వెంటనే బియ్యాన్ని నడివీధిలో పారబోశాడు. నాణేలతో బియ్యం మైలపడ్డా యనుకున్నాడేమో! అని బ్రాహ్మణుడు ఆశ్చర్యపోయాడు. ఆ భిక్షుక గాయకునికి బంగారం అంటే వైరాగ్యం. తంజావూరు పాలకుడు శరభోజి మహారాజు అతనికి ఎలాగైనా ధనం సమర్పించాలని వ్యర్థ ప్రయత్నాలు చాలా చేశాడు. చివరకు బియ్యంలో నాణేలు నింపి భిక్ష వెయ్యమని బ్రాహ్మణుడిని నియోగించాడు. అదీ ఇలా విఫలం అయింది. అంతటి 'వైరాగ్యం' కలిగిన గాయకుడు సామాన్యుడా! శ్రీరామచంద్రుని కల్యాణ గుణాలను కీర్తిస్తూ కృతులను విరచించిన భారతీయ వాగ్గేయకారులలో మొట్టమొదటివాడు, త్యాగరాజు. 'నిధి చాలా సుఖమా! రాముని/ సన్నిధి సేవ సుఖమా! నిజముగ పల్కు మనసా..' మొదలైన కీర్తనలు ఆయన వైరాగ్యాన్ని, రామభక్తిని వేనోళ్ల నిరూపిస్తాయి. రాజులెంత గొప్పవాళ్లు అయినా వారిని స్తుతించరాదని ఈ కీర్తనలోనే.. 'మమతా బంధనయుత నరస్తుతి సుఖమా..' అని బాహాటంగా చెప్పాడు. తన సంగీతాన్నంతా సర్వేశ్వరుడైన శ్రీరామచంద్రునికి సమర్పించుకున్న మహాభక్తుడుగా, 'నాదబ్రహ్మ'గా పేరు గాంచిన సంగీత చక్రవర్తి త్యాగరాజు.



ఆధ్యాత్మికం

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయండి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి
- కేంద్రానికి వామపక్ష పార్టీల తో కలిసి డిల్లీ ముట్టడి కి పిలుపు నిస్తాం
- శాంతి చర్చల కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తాం
- కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి
- మావోయిస్టులతో చర్చలు జరపాలి: ప్రజా సంఘాల డిమాండ్
- సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్







రామగిరి,, జూన్ 26:- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని నిలువరించేలా చొరవ చూపాలని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలని మావోయిస్టుల తో సంభందాలు ఉన్నాయని ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్గఢ్ లో కర్రె గుట్టలో ఉన్న ఆదివాసి ప్రజలను కేంద్ర ప్రభుత్వం మారణహోమం సృష్టించి వేలాది మంది ఆదివాసీ గిరిజన ప్రజలను చంపుతుందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ ను నిలిపి వేయాలని, లేకుంటే వామపక్ష పార్టీల తో కలిసి డిల్లీ ముట్టడి కి పిలుపు నిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హెచ్చరించారు.రామగిరి మండల మహాసభ మంగళవారం కే ఎల్ మహేంద్ర భవన్ లో జరిగిన సిపిఐ మహాసభలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వై.వి రావు, సిపిఐ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మార్చి 2026 లోపు దేశంలో మావోయిస్టులను లేకుండా మట్టు పెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ను, ఆదివాసీ గిరిజన ప్రజలను మారణహోమం సృష్టించి చంపుతుందని ఆయన విమర్శించారు. ఛత్తీస్గఢ్ లో కర్రె గుట్ట లో ఉన్న మావోయిస్టుల తో పాటు ఆదివాసి ప్రజలను అకారణంగా కేంద్ర బలగాలను రంగంలోకి దింపి చంపుతున్నారని, ఎంతో మంది అమాయక ప్రజలు తమ విలువైన ప్రాణాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. మావోయిస్టులు ఈ దేశ ప్రజలని, వారు ఎక్కడ నుండో రాలేదని, ఎక్కడైతే అణిచివేత ఉంటుందో అక్కడి ప్రజల రక్షణ కోసం, వారి హక్కుల సాధన కోసం మావోయిస్టులు ఉంటూ ప్రజల అణిచివేత కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ ను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా ఆపరేషన్ కగార్ ను నిలిపి వేయాలని, ఆరు నెలల పాటు కాల్పులు విరమణ చేశామని మావోయిస్టులు కేంద్ర ప్రభుత్వం కు లేఖ రాశారని, అదేవిధంగా సిపిఐ పార్టీ కూడా కేంద్ర ప్రభుత్వం కు లేఖ రాయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఐనా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆపరేషన్ కగార్ ను నిలిపి వేసేది లేదని 2026 మార్చి లోపు మావోయిస్టుల ను అంతం చేయడమే కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని ఆయన ప్రకటించడాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీల కు ఖనిజ సంపదను దోచి పెట్టడానికే ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీ గిరిజన ప్రజలను, మావోయిస్టుల ను బూటకపు ఎన్కౌంటర్ లు చేస్తూ మారణహోమం సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ మొండి వైఖరి విడనాడి ఆపరేషన్ కగార్ ను నిలిపి వేయాలని, లేకుంటే వామపక్ష పార్టీల తో కలిసి సిపిఐ పార్టీ లీడు తీసుకొని డిల్లీ ముట్టడి కి పిలుపు నిస్తామని ఆయన హెచ్చరించారు. అదే విధంగా దేశం లో సిపిఐ పార్టీ ఆవిర్భావం జరిగి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025 డిసెంబర్ 26 లోపు సిపిఐ జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ మహాసభలను జరుపుకోవాలని, నూతన నాయకత్వం తో దేశ వ్యాప్తంగా ప్రజల సమస్యల్ని పరిష్కరించడం కోసం ఉద్యమాలు నిర్వహించాలని పార్టీ జాతీయ సమితి నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల 28 న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా నాలుగవ మహాసభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇట్టి మహాసభ లను ప్రజలు కార్మికులు, పార్టీ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య సిపిఐ, ఏఐటియుసి నాయకులు జూపాక రామచందర్, ఎమ్.ఆర్.సీ రెడ్డి, క్రాంతి, డీటీ రావు, ఇప్ప గంగాధర్, సాంబశివ రెడ్డి, రంజిత్, మొండయ్య, రాజేందర్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు. రామగిరి మండలం నూతన కమిటీ కార్యదర్శి గా జూపాక రామచందర్, సహాయ కార్యదర్శి గా క్రాంతి కార్యవర్గ సభ్యులు గా ఎమ్.ఆర్.సీ రెడ్డి, క్రాంతి, డీటీ రావు, ఇప్ప గంగాధర్, సాంబశివ రెడ్డి, రంజిత్, మొండయ్య, రాజేందర్, ధర్మయ్య లను ఎన్నుకోవడం జరిగింది.

# డ్రగ్స్ ద్వారా జరిగే దుష్పరిణామాలను వివరంగా విద్యార్థులకు వివరించారు..






శామీర్ పేట, జూన్ 25 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట, శామీర్ పేట బుధవారం యన్ ఎస్ ఎస్ తరఫున ఏంటి డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రామును శామీర్ పేట పోలీస్ స్టేషన్ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా హారిక దబ్బా ఎస్ ఐ పి శామీర్ పేట మాట్లాడుతూ డ్రగ్స్ ద్వారా జరిగే దుష్పరిణామాలను వివరంగా విద్యార్థులకు తెలిపారు. పోలీస్ జాబ్ మీద ఇంట్రెస్ట్ ఉన్న విద్యార్థులకు ఏ బుక్స్ చదివితే మంచిది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా! ఇష్రత్ మాట్లాడుతూ ఈ అవేర్నెస్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులతో పాటు కళాశాలలో ఉన్న అధ్యాపకులకు కూడా చాలా విషయాలను తెలియచేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి ప్రవంతి , ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత, సుధా మాధురి, యూ ఓ సి సైబర్ వారియర్, శ్రీనివాస్ పీసీ %ం% పెట్రోల్ మొబైల్ స్టాఫ్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# తులసి నీళ్లు రోజూ తాగితే అమృతం తాగినట్లే..! అందం, ఆరోగ్యంతో పాటు బోలెడు ప్రయోజనాలు!

యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబియల్ లక్షణాలు నిండివున్న తులసి రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఈ వేడి సీజన్‌లో తులసి నీటిని తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయం టున్నారు ఆరోగ్య నిపుణులు. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపునొప్పి, గ్యాస్, అసిడిటీ వంటి అసౌకర్యాల నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ పానీయం శరీరాన్ని శుభ్రపరచడంలో, ఆరోగ్యకరమైన జీర్ణ ప్రక్రియను ప్రారంభించడంలో సహాయపడుతుంది. దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియల్ లక్షణాలతో, తులసి నీరు దగ్గు, జలుబు లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని సమర్థవంతంగా బలోపేతం చేస్తుంది. తులసి ఆకులు సహజమైన డిటాక్సిఫైయర్. ఉదయాన్నే పరగడుపున తులసి నీటిని తాగడం వల్ల డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్, క్రిములు బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయి.



తులసి నీటిని తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగపడతాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. తులసి నీరు కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో ఒత్తిడిని కలిగించే ఒత్తిడి హార్మోన్ అని కూడా పిలుస్తారు. తులసి నీటిని తాగడం వల్ల కార్టిసాల్ స్థాయిలు తగ్గుతాయి. అలాగే మీరు ఒత్తిడి లేకుండా ఉండేందుకు సహాయపడుతుంది.

## పదోన్నతితో బదిలి అవుతున్న ఓసీ-వన్ అధికారులకు ఘన సన్మానం





రామగిరి, జూన్ 26:- సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో ఓసి-వన్ నందు పనిచేస్తూ పదోన్నతితో బదిలి అవుతున్న అధికారులు డి.రమేష్, అందె కోటయ్య లను ఘనంగా సన్మానించారు. మూడు నెలల పాటు ఆర్జీ-3, ఓసీ-వన్ మేనేజర్ గా పనిచేసి గోదావరిఖని కోల్ మైన్స్ గ్రూప్ ఏజెంట్ గా పదోన్నతి పొందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ డి రమేష్, రక్షణ అధికారిగా పని చేస్తున్న అదనపు మేనేజర్ అందె కోటయ్య శ్రీరాంపూర్ ఏరియా ఇందారంఖని వన్ ఏ ఇంక్లైన్ మేనేజర్ గా పదోన్నతి పొంది బదిలీ అయినా సందర్భంగా ఆర్జీ-3, ఓసి-వన్ ప్రాజెక్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాలువాళ్లతో ఘనంగా సన్మానించి వారు గనిలో చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గనిలో సహకరించిన ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, అదే దిశలో మిగతా అధికారులకు, యాజమాన్యానికి సహకరిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు కృషి చేయాలనీ డి రమేష్, అందె కోటయ్య లు కోరారు. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి జింగిటి రాజశేఖర్, అదనపు మేనేజర్ బైరి రమేష్, రక్షణ అధికారి చిప్ప జనార్దన్, కాలరీ ఇంజనీర్ జి ఎస్ నజీర్ అహ్మద్, సూపర్వైజర్లు డిటి రావు, మామిడి సాంబయ్య మోతుకూరి సాంబయ్య, దేగ వెంకట్రాజం, రాసపల్లి రాజేందర్, ఊదరి ఒదయ్య, కొలిపాక సారయ్య, కాంటేవాడ బుగ్గాజి, శివగోపాల్, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ శ్రీకాంత్ రెడ్డి పై దాడి చేయడం సరికాదు

- నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షు పీక కిరణ్ డిమాండ్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జూన్ 25( హైదరాబాద్ న్యూస్ ): ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ శ్రీకాంత్ రెడ్డి పై మంగళవారం సాయంత్రం కొంతమంది కలిసి దాడి చేయటం సరికాదని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే జర్నలిస్టులపై దాడులు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడాలే తప్ప, దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. శ్రీకాంత్ రెడ్డి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తుందని, దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. లేనిపక్షంలో తెలంగాణ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. శ్రీకాంత్ రెడ్డి పై జరిగిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని పీక కిరణ్ పిలుపునిచ్చారు.

## క్రిమినల్ కేసులు పెట్టాలి

- కాటారం మండల జర్నలిస్టుల డిమాండ్



కాటారం జూన్ 25( హైదరాబాద్ న్యూస్): ములుగు జిల్లా తాడ్వాయిలో జర్నలిస్టు శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను పార్టీ నుండి సస్పెండ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాటారం మండల జర్నలిస్టులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. జర్నలిస్టుపై దాడిని నిరసిస్తూ మండల కేంద్రంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి చేసిన వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జర్నలిస్టుల పై దాడి చేస్తే ఇక పై సహించేది లేదని అన్నారు.వారి పై కఠిన చర్యలు తీసుకునే వరకు జర్నలిస్టుల పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ ధర్నాలో జర్నలిస్టులు చీర శ్రావణ్ రెడ్డి, గ్రైని రమేష్, రాం రెడ్డి, పెండాల రంజిత్ కుమార్, కట్ల రవి, మంతెన రాజబాబు, గజ్జల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కేవలం రూ.20తో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి బయటపడొచ్చు.. ఎలాగో తెలుసా?

శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. యూరిక్ యాసిడ్‌ను తగ్గించగల 5 ప్రభావవంతమైన హోమ్ రెమెడీస్ ఇవే.. ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది. రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవిమూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది. ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి..

# గోదావరి ఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం అభివృద్ధికి వాకర్స్‌తో ఎమ్మెల్యే సమీక్ష



**గోదావరి ఖని టౌన్ :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తమ సతీమణి మనాలి ఠాకూర్ తో కలిసి గోదావరిఖనిలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో వాకర్స్ తో కలిసి పాదయాత్ర (వాక్) చేయడమైంది. ఈ సందర్భంగా వారు వాకింగ్ చేస్తున్న వాకర్స్ ను స్వయంగా కలసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉదయపు చల్లని వాతావరణంలో ప్రజలతో మమేకమై, వారి అవసరాలను దగ్గరగా తెలుసుకున్నారు జవహర్లాల్ నెహ్రూ స్టేడియం తెలంగాణ రాష్ట్రంలోనే మంచి పేరు వచ్చే విధంగా అభివృద్ధి చేసి చూపిస్తా ఈ సందర్భంలో శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ స్టేడియం యొక్క ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. క్రీడాభివృద్ధికి, యువతలో ఆరోగ్యవంతమైన జీవనశైలి ప్రోత్సాహానికి ఈ స్టేడియం ఎంతగానో ఉపయోగపడతుందని ఆయన పేర్కొన్నారు. వాకర్స్ తో మాట్లాడేటపుడు, వారు ఎత్తిచూపిన సమస్యలు మరియు అభివృద్ధి, అవసరాలను మనస్ఫూర్తిగా పరిశీలించిన శాసనసభ్యులు, సమగ్ర అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టేందుకు సంబంధిత అధికారులతో చర్చలు జరిపి త్వరలోనే కార్యాచరణ ప్రారంభమవుతుందని హామీ ఇచ్చారు. అత్యవసరంగా చేపట్టవలసిన అభివృద్ధి అంశాల్లో భాగంగా: వాకింగ్ ట్రాక్ మరమ్మత్తులు స్టేడియం లోని రాత్రి వెలుగుల ఏర్పాటు. పబ్లిక్ టాయిలెట్స్ మహిళల మరియు వృద్ధుల కోసం ప్రత్యేక వాకింగ్ జోన్లు గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థలో మెరుగుదల యువత కోసం ఆధునిక క్రీడా పరికరాల ఏర్పాటు. ఈ కార్యాచరణలో స్థానిక కార్పొరేటర్లు, క్రీడా సంఘాల ప్రతినిధులు, వాకింగ్ క్లబ్ సభ్యులు, మరియు ఇతర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యుత్తు సరఫరాను మెరుగుపరచడానికి 33/11 కేవీ సబ్ స్టేషన్లు

◆ ఎమ్మెల్యే చేతుల మీదుగా "ఖని 'లో రెండు ట్రాన్స్ ఫార్మర్‌లు ప్రారంభం



**గోదావరి ఖని టౌన్ :** విద్యుత్తు సరఫరాను మెరుగుపరచాడానికి గాను గోదావరిఖని పట్టణం లో రెండు ట్రాన్స్ ఫార్మర్లను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించారు.. శారద నగర్, రామమందిర్ ఏరియాల్లో రూ.2 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ప్రారంభించి మాట్లాడుతూ సిఎం. రేవంత్ రెడ్డి పేదల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందించడం జరిగిందన్నారు. ఈ సబ్‌స్టేషన్లలో 8 మెగావాట్ల సామర్థ్యం గల రెండు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ ప్రజలకు నిరవధికంగా, ఒత్తిడిలేని విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందన్నారు. ఇంతకుముందు 5 మెగావాట్ల ట్రాన్స్ ఫార్మర్ ద్వారా విద్యుత్ పంపిణీ జరుగుతుండగా, ఇప్పుడు 8 మెగావాట్ల ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు వల్ల విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలవు తుందన్నారు.. ఇది పరిశ్రమలు, గృహాల విద్యుత్అవసరాలకు పెద్ద ఎత్తున ఉపయోగ పడుతుందన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు ఈ సబ్‌స్టేషన్ల ద్వారా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నా మన్నారు.. ఈ కార్యక్రమంలో విద్యుత్ సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చక్కగా చదువుకోండి తల్లిదండ్రులకు దేశానికి పేరు తీసుకురండి

◆ బాలికల పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా ◆ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ◆ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్





**గోదావరి ఖని టౌన్ :** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత దాదాపు పాఠశాలల కోసం రూ.10 కోట్ల రూపాయలను కేటాయించానని ఆయన పేర్కొన్నారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు రాష్ట్రానికి దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. గోదావరిఖని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వసతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నోటుబుక్కులు యూనిఫామ్ లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా ఈ పాఠశాలలో ఒకరోజు బస చేశానని అన్నారు. అప్పుడే ఈ పాఠశాలను అభివృద్ధి చేయాలనే ఆలోచన కలిగిందన్నారు. దాదాపు రెండు ఎకరాల స్థలంలో ఈ పాఠశాలలను నిర్మించాలని భావించడం జరిగిందన్నారు. కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వచ్చి పట్టణం నడిబొడ్డున ఈ పాఠశాల ఉండడంతో విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువగా ఉందని తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందన్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను నిర్మించడానికి, పాత గదులను కొంత తొలగించి నూతనంగా గదులను నిర్మించడానికి తన వంతు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించాలని, అదేవిధంగా మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జింక మల్లేశం, ఉపాధ్యాయులు పిసిబి శాస్త్రి, రమాదేవి, అరుంధతి, సంపత్ రావు, పి.డి. కనుకుంట్ల లక్ష్మణ్, శ్రీనివాస్, రాజమౌళి, రామచంద్ర రావు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, మాజీ కార్పొరేటర్ మహంకాళి స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొంతల రాజేష్, ఎం. డి. ముస్తఫా,పాతపల్లి ఎల్లయ్య, దూళికట్ట సతీష్, పాఠశాల విద్యార్థులు పోషకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమర్జెన్సీ నిర్బంధానికి యాభై ఏళ్లు

- చీకటి రోజుకు వ్యతిరేకంగా అమరవీరుల స్తూపం వద్ద పౌర హక్కుల సంఘం నిరసన



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్ స్టేషన్ సమీపంలో గల అమరవీరుల స్థూపం వద్ద బుధవారం పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ నిర్బంధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డుపెల్లి రవి మాట్లాడుతూ ఇందిరా ప్రభుత్వం 1975 జూన్ 25 రోజు అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించి 21నెలల కాలం ఎమర్జెన్సీని కొనసాగించడంతో భారతదేశంలోని ప్రజలకు పౌర ప్రజాస్వామిక హక్కులను హరించి భారతదేశ వేలాదిమంది ప్రజలను బందీలుగా చేసి హక్కులను కాలరాసి అనేక చిత్రహింసలకు గురిచేసిందన్నారు. నాటి నుండి నేటి వరకు క్రూరమైన చట్టాలను తీసుకు వచ్చారని, ఎమర్జెన్సీ తర్వాత 1985 టడా చట్టాన్ని 2002లో ఫోటా చట్టాన్ని 2004 నుండి ఊపా చట్టాన్ని తీసుకువచ్చి 2024 వరకు క్రూరమైన చట్టాన్ని అమలుపర్చి ప్రజలు, కళాకారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, మేధావులను ఉపా చట్టంతో నిర్బంధించారని పేర్కొన్నారు. ఆపరేషన్ గ్రీన్ హంట్ ఆపరేషన్ పహార్ ఆపరేషన్ కొనసాగించి 2025 జనవరి 1 నుండి ఆపరేషన్ కగార్ పేరుతో 560 మందిని ఎన్కౌంటర్ల పేరుతో హత్య చేయడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు నారా వినోద్,సహాయ కార్యదర్శి రెడ్డి రాజుల సంపత్ ,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో కాన్సియస్నెస్ క్లబ్ ఏర్పాటు...

**మానకొండూర్, జూన్ 25,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం చెంజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ పోలీసులు బుధవారం కాన్షియస్నెస్ క్లబ్ ను ఏర్పాటుచేసి మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలను వివరించి వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తూ కాన్సియస్నెస్ క్లబ్ లో సభ్యులుగా ముగ్గురు ఉపాధ్యాయులు, ఇద్దరు విద్యార్థులుంటారని,మాదక ద్రవ్యాలపై ఏదైనా సమాచారం ఉంటే వీళ్లకి తెలియజేయాలని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మన్ రావు, ఉపాధ్యాయులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



# రామగుండం బ్రాంచి జీవిత బీమా ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా జనగామ సదయ్య - ప్రధాన కార్యదర్శిగా కటకం సతీష్ - కోశాధికారిగా అంబాల బాబు



**గోదావరి ఖని టౌన్** రామగుండం బ్రాంచ్ భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య 1964 వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘ అధ్యక్షులు గుడికందుల రవి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. రామగుండం ఏజెంట్ల సంఘం అధ్యక్షుడిగా జనగామ సదయ్య, ప్రధాన కార్యదర్శిగా కటకం సతీష్,, కోశాధికారిగా అంబాల బాబు ఎన్నికయ్యారు.ఈ సమావేశం లో ఆలిండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ చైర్మన్ బోయినపల్లి ప్రభాకర్ రావు, కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు గట్టు రాజయ్య, ప్రధాన కార్యదర్శి పెంచాల రంగారావు, ఆర్థిక కార్యదర్శి గంధం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఎన్నికల కమిటీ ప్రతినిధులు గా వి. తిరుపతిరెడ్డి, ఎస్. రమేష్, కె. సత్యనారాయణ, ఈ. కనకయ్య, వేముల శంకర్, అచ్చే వేణు, భాస్కర కుమారస్వామి, ఆకుల సురేష్, కాశెట్టి శివ, చింతల శ్రీనివాస్, పోలే రాజు, చింతం శ్రీనివాస్, టి.ఆర్. రఘు, కందుల శ్రీనివాస్, ఐ. శ్రీనివాస్, ఎం. సత్యం, ఆర్. రవి, కె. శ్రీధర్, గొర్రె అనిల్ లు వ్యవహరించారు.ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన 500 మందికి పైగా ఏజెంట్లు హాజరయ్యారు.

# ఆరోగ్య రామగుండమే లక్ష్యంగా వంద రోజుల కార్యాచరణ

- నగరపాలక డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి





**గోదావరి ఖని టౌన్** పరిసరాల పరిశుభ్రతకు ప్రధమ ప్రాధాన్యత ఇవ్వాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళ వారం మెప్మా ఆధ్వర్యంలో ఎన్ టి పి సి అన్నపూర్ణ కాలనీ , మేడిపల్లి సెంటర్ లలో సామాజిక , ప్రజా మరుగుదొడ్లు పరిశీలించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిశుభ్రం చేయడంతో పాటు శ్రీ జ్యోతి , శ్రీ సరస్వతి , వెన్నెల మహిళా సమాఖ్య లు , రామగుండం పట్టణ సమాఖ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సంధర్భంగా అన్నపూర్ణ కాలనీ అంబేద్కర్ కమ్యూనిటి హాల్ , ఎఫ్ సి ఐ క్రాస్ రోడ్స్ లో ని మహిళా భవన్ లో నిర్వహించిన వేర్వేరు సమావేశాల్లో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. తడి చెత్త , పొడి చెత్త వేరు చేసి అందించడం , ప్లాస్టిక్ నిషేధం , కుక్క కాటు బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు , దోమల నిర్మూలనకు చేపట్టవలసిన చర్యలు తదితర అంశాలను వివరించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం చేస్తామని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ ,మెప్మా టి ఎం సి మౌనిక , సి ఓ శ్వేత, ఆర్ పి లు , ఓ బి లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమ్మ పేరు మీద మొక్కలు నాటిన సోమారపు లావణ్య



**గోదావరి ఖని టౌన్** భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆదేశాల మేరకు మంగళవారం రోజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ లో అమ్మ పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమం మహిళా మోర్చా నాయకురాలు సోమరపు లావణ్య ఆధ్వర్యంలో 200 మొక్కల కు పైగా, కాలేజీ ప్రిన్సిపాల్ జై పాశం, లెక్చరర్స్, బిజెపి నాయకులు, స్కౌట్స్, మహిళల చేత నాటించడం జరిగింది తదనంతరం బస్టాండ్ ప్రాంగణం లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో మారేడు, తులసి, ఉసిరి మరియు పూల మొక్కలు పంచడం జరిగింది . ఈ కార్యక్రమంలో లో స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుల్వా లక్ష్మీనారాయణ, స్టేట్ ఎస్ సి మోర్చా నాయకులు కాశీపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, మాజీ మాడల్ అదేక్ష్యులు గోపగాని నవీన్ గౌడ్, దాసరి శ్రీనివాస్, మేకల శివ, మేడి రాజు, శ్రవణ్, మంజుల, వనజ, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీ 1 ఏరియాలో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ సర్ఫేస్ పోస్టుల కౌన్సిలింగ్




**గోదావరిఖని ప్రతినిధి :** అర్జీ 1 ఏరియా జిఎం కార్యాలయం నందు ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ సర్ఫేస్ పోస్టుల కోసం కౌన్సిలింగ్ నిర్వహించటం జరిగింది. ఇట్టి కౌన్సిలింగ్ కమిటి అధికారులైన యస్ఒటు జియం గోపాల్ సింగ్, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్ రావు, ఏజీఎం ఐఈడి ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి సమక్షంలో నిర్వహించటం జరిగింది. ఇట్టి కౌన్సిలింగ్ కు ఆర్.జి 1 ఏరియాకు సంబందించిన ఫిట్టర్ లు, ఎలక్ట్రిషియన్ ఉద్యోగులు వివిధ గనుల నుండి పాల్గొనటం జరిగింది. మెత్తం ఫిట్టర్ సర్ఫేస్ పోస్టుల కోసం 47 మంది దరఖాస్తు చేసుకోగా సినియారిటి ప్రాతిపదకన 8 పోస్టులను ఇవ్వటం జరిగింది. ఎలక్ట్రిషియన్ పోస్టుల కోసం 44 మంది దరఖాస్తు చేసుకోగా 7 పోస్టులను సినియారిటి ప్రాతిపదకన భర్తీ చేయటం జరిగింది. వీరికి సీనియారిటీ ఆధారంగా సర్ఫేస్ పోస్టులను ఇవ్వటం జరిగిందని, ఇట్టి కౌన్సిలింగ్ ను పూర్తి పారదర్శకంగా కమిటి అధికారుల సమక్షంలో నిర్వహించటం జరిగింది. ఇట్టి కౌన్సిలింగ్ సీనియర్ పిఒ ఎం.డి.ఫిరోజ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ అన్వేష్ వివిధ గనుల ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ ఉద్యోగులు పాల్గొనటం జరిగింది.

## ఆర్ జి 1 ఏరియా అధికార ప్రతినిధిగా పదవి బాధ్యతలు చేపట్టిన పర్సనల్ మేనేజర్‌ని సన్మానించిన సేవా సమితి సభ్యులు



**గోదావరిఖని ప్రతినిధి :** ఆర్.జి. 1 ఏరియాకు అధికార ప్రతినిధిగా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సింగరేణి సేవా సమితి సభ్యులు, ఫ్యాకల్తి మెంబర్స్‌వారిని పర్సనల్ విభాగం నందు శాలువాతో సన్మానించటం జరిగింది. ఈ సందర్భంగా సేవా సభ్యులు తెలియజేస్తూ సింగరేణిలోనే కీలకమైన రామగుండం ఏరియా-1 అధికార ప్రతినిధిగా భాద్యతలు చేపట్టటం గొప్ప అవకాశం అని అన్నారు. ఈ కార్యక్రమములో సేవా సభ్యులు రమాదేవి, సత్యావతి, పద్మ, రేష్మ, శ్రీదేవి, స్రవంతి, శారద,లత,వనితా సేవాసమితికో ఆర్డినేటర్ మేడితిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కుల పంపిణీ



**రామగిరి జూన్26:-** మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు అకాడమీ ముద్రించిన పాఠ్య పుస్తకాలతో పాటు శ్రీసీతా రామ సేవ సదన్ అందించిన నోటు బుక్కులను విద్యార్థులకు బుధవారం ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే వారికి వేల రూపాయలు విలువైన అకాడమీ పుస్తకాలని అందించామన్నారు. ప్రైవేటు సంస్థలకు ధీటుగా ఫలితాలు సాధిస్తూన్న ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ పొంది పతాము అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాలొన్నారు.

## యువత బంగారు భవిశ్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్

- స్వచ్ఛసమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ పాటుపడలి
- పెద్దపల్లి జిల్లా న్యాయమూర్తి కుంచాల సునీత



**పెద్దపల్లి ప్రతినిధి:** స్వచ్ఛమైనసమాజానిర్మాణానికి ప్రతిఒక్కరు పాటుపడాలని పెద్దపల్లి జిల్లా న్యాయమూర్తి కుంచాల సునీత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా గోడప్రతిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాన్నినాశనం చేసుకోవద్దని సూచించారు. పిల్లలప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్సుకు అలవాటు పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, రవాణా చేస్తున్నా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ అథెటిక్స్ సెక్రటరీ స్వప్నరాణితో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఆర్.టి.ఐ ప్రకారం సమాచారం ఇవ్వాల్సిందే




**రామగిరి, జూన్ 26:-** మంథని అసిస్టెంట్ లేబర్ కార్యాలయంలో పూర్తి సమాచారం ఇవ్వాలని ఆర్టీఐ ప్రకారం దరఖాస్తు పెట్టిన నానువాళ్ళ నారాయణ రెడ్డి కి పూర్తి సమాచారం ఇవ్వాలని ఆర్టీఐ కమిషనర్ మంథని లేబర్ అసిస్టెంట్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేశారు. గత రెండు సంవత్సరాల క్రితం సమాచారం కోసం దరఖాస్తు చేసుకునే నారాయణరెడ్డిని హైదరాబాద్కు పిలిపించిన కమిషనర్ ఆయన ఫిర్యాదు చేసిన దానిపై వివరాలు తెలుసుకుని మంథని లేబర్ కార్యాలయం కమిషనర్ ముందు హాజరైన వారికి 15 రోజుల్లోగా సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. దీనిపై ఫిర్యాదుదారుడు నారాయణరెడ్డి హర్ష వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్న లేబర్ కమిషనర్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గొర్రెలతో గాంధీ భవన్‌కు వెళ్లడంలో దురుద్దేశం లేదు

- ప్రభుత్వంలో యాదవుల పాత్ర లేదనే ఆవేదనతో మాత్రమే నిరసన
- యాదవ సంఘం నాయకులు



**పెద్దపల్లి ప్రతినిధి :** ఈనెల 23న హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్ కు గొర్రెలతో వెళ్ళడంలో ఎలాంటి దురుద్దేశం లేదని యాదవ సంఘం నాయకులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని యాదవ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సలేంద్ర రాములు యాదవ్ అధ్యక్షతన బుధవారం జరిగిన పత్రికా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలారపు పర్వతాలు యాదవ్ మాట్లాడారు. గత 20 నెలలుగా గొర్రెలు, మేకలు, పశు వులకు సంబంధించిన మందులను వాటి బాగోగులను పశుసంవర్ధక శాఖ, రాష్ట్ర ప్రభుత్వం పట్టించు కోవడంలేదని, కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర ప్రభుత్వంలో యాదవుల పాత్ర లేకుండానే ప్రభుత్వము నడుస్తున్నదని ఆవేదనతో నిరసన మాత్రమే తెలిపినట్లు చెప్పారు. యాదవుల పాత్ర లేకుండా ప్రభుత్వాలు నడవలేదని, కానీ రెండుసార్లు మంత్రివర్గ విస్తరణ జరిగినా కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులలో ఒక్కటి కూడా అందించలేదని పార్టీ పదవుల్లో కూడా యాదవుల ప్రాతినిధ్యం లేకుండా ఉన్నదని అవమానంగా, అగౌరవంగా భావించి మా ఆవేదనను ప్రభుత్వానికి, కన్నతల్లి అయిన కాంగ్రెస్ పార్టీకి తెలియజేయాలనే ఉద్దేశంతో గొర్రెలను గాంధీభవన్ కు తోలుకొని వెళ్లినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే నామినేటెడ్ పదవులలో పెద్దపల్లి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించాలని, పశు సంవర్ధక శాఖకే ఒక మోడల్ జిల్లాగా పేరొందిన పెద్దపల్లి జిల్లాను పరిగణలోకి తీసుకొని ఇక్కడి కాంగ్రెస్ పార్టీ నాయకులకు పదవులను అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల అభివృద్ధి సమైక్య చైర్మన్ పదవిని పెద్దపల్లి జిల్లాకు కల్పించే బాధ్యత మంత్రి శ్రీధర్ బాబుపై ఉన్నదని అభిప్రాయపడ్డారు. నూతనంగా మంత్రి బాధ్యతలు చేపట్టిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ బాధ్యత తీసుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ తరఫున విజ్ఞప్తి చేశారు. ఇతర పార్టీలు అయిన బిఆర్ఎస్, బిజెపి యాదవులకు పార్టీ పదవులలో, నామినేటెడ్ పదవులలో మా దామాషా ప్రకారం పదవులను ఇవ్వని పక్షంలో బిజెపి, బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ కార్యాలయాలను పెద్ద ఎత్తున గొర్రెలు, మేకలతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జికేఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల నాగరాజ్ యాదవ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నర్సయ్య యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షుడు దాడి చంద్రమౌళి యాదవ్, దొంగతుర్తి మాజీ ఎంపీటీసీ దాడి సదయ్య యాదవ్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెత్తుల నాగరాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేయడం హేయమైన చర్య

- ఘటనకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలి - ఈ ఘటనకు మంత్రి సీతక్క బాధ్యత వహించాలి
- భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా సీఎం చొరవ చూపాలి
- టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్

**పెద్దపల్లి ప్రతినిధి :** తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాడనే నెపంతో ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లపూర్ గ్రామానికి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీకాంత్ రెడ్డి పై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్ గౌడ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మల్లావర్జుల వంశీ విద్యానంద్, జిల్లా కార్యదర్శి నారాయణ దాసు అశోక్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బాధ్యత వహించాలని, ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారిదిగా నిలుస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో జరిగే లోపాలను ఎత్తిచూపడం జర్నలిస్టుల విధి అని అన్నారు. జర్నలిస్టులు కావాలని తప్పుడు వార్తలు రాస్తే లీగల్ గా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, వారిని భయభ్రాంతులకు గురి చేసే విధంగా భౌతిక దాడులకు దిగడాన్ని సహించేది లేదని పేర్కొన్నారు. మంగళవారం తాడ్వాయి వద్ద కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు జర్నలిస్టు శ్రీకాంత్ రెడ్డిని అటకాయించి కారులో ఎక్కించి హత్యాయత్నానికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భయభ్రాంతులకు గురి చేస్తే భయపడేది లేదని, రాజకీయాల్లోకి నేతలు వస్తుంటారు, పోతుంటారని అలాంటివారిని తాము ఎంతో మందిని చూశామని, జర్నలిస్టులు శాశ్వతంగా కొనసాగుతారనే విషయాన్ని ఏ నాయకుడైన మరువకూడదని అన్నారు. జర్నలిస్టు శ్రీకాంత్ రెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. లేనట్లయితే రాష్ట్ర వ్యాప్తంగా తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. దత్తురెడ్డి అకాల మరణం పత్రికా రంగానికి తీరని లోటు టియుడబ్ల్యూజె ఐజెయు సంతాపం పత్రికా రంగంలో సీనియర్ జర్నలిస్టు, వరంగల్ ఈనాడు బ్యూరో చీఫ్ జీడిపల్లి దత్తురెడ్డి ఆకస్మిక మరణం పత్రికా రంగానికి తీరని లోటని టియుడబ్ల్యుజె ఐజెయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్ర సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షులు మల్లావర్జుల వంశీ విద్యానంద్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్ అన్నారు. దత్తురెడ్డి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. పత్రికా రంగంలో విశేష సేవలందిస్తూ దత్తు రెడ్డి పిన్న వయస్సులోనే గుండెపోటుతో కన్నుమూయడం బాధాకరమన్నారు. దత్తురెడ్డి మృతిపట్ల జిల్లా యూనియన్ నాయకులు, సభ్యులు సంతాపం తెలిపారు.

# దళిత గిరిజన విద్య పైన చిత్త శుద్ధి లేని రాష్ట్ర ప్రభుత్వం

- కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్
- బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా



**పెద్దపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వానికి దళిత గిరిజన విద్య పైన చిత్తశుద్ధి లేదని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లేపల్లి అశోక్ పేర్కొన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులతో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కల్లెపల్లి అశోక్ మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థినీ విద్యార్థులకు 3 సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు ఉండడం వలన జిల్లాలో విద్యార్థులను స్కూల్లో జాయిన్ చేసుకోవడం లేదని, ఫీజులు కట్టమని పుస్తకాలు బట్టలు కొనమని ఎంతో మనోవేదనకు యజమాన్యాలు గురిచేస్తున్న అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర మంత్రులు కానీ జిల్లా కలెక్టర్ కానీ ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని అన్నారు. విద్యార్థులకు విద్య అందించుటకు ఇప్పటికైనా పెండింగ్ బిల్లును విడుదల చేసి ప్రతి ఒక్క విద్యార్థిని పాఠశాలలో జాయిన్ చేయించి బట్టలు పుస్తకాలు అందించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు మొదుంపల్లి శ్రావణ్ మాట్లాడుతూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థుల సమస్యల పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ,సురేష్ లావణ్య, రమేష్, శ్రీనివాస్, రవి,సంతోష్ గీత, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# పేద బిడ్డల విద్యాభివృద్ధికి పాటుపడాలి





**తొర్రూరు,** ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద బిడ్డల విద్యాభివృద్ధికి పాటుపడాలని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్ లో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 10 వేల పలకలు పంపిణీ చేసిన అనంతరం వందేమాతరం ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఝాన్సీ రెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..... ప్రభుత్వ బడుల బాగు కోసం వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ రావు చేస్తున్న కృషి అభినందనీ యమన్నారు. పేద బిడ్డలను ఉన్నతులుగా మార్చేందుకు వందేమాతరం చేస్తున్న ప్రయత్నం ప్రశంసనీయమన్నారు. ఫౌండేషన్ చేపడుతున్న విద్యా సేవా కార్యక్రమాలు ప్రభుత్వానికి ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పేద బిడ్డల అభివృద్ధికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. విద్యారంగంపై ప్రభుత్వానికి ప్రత్యేక విజన్ ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి పాటుపడుతున్న వందేమాతరం ఫౌండేషన్ కు హెచ్ఆర్ జెఆర్ ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.1 లక్ష తక్షణ విరాళం, తొర్రూరు మాజీ సర్పంచ్,నాన్న పెద్దనాన్న పౌండేషన్ చైర్మన్ ధరావత్ రాజేష్ నాయక్ రూ.20 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీంద్ర, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పోనుగోటి సర్వేశ్వరరావు, పెదగాని సోమయ్య,చాపల బాపు రెడ్డి, ధరావత్ రాజేష్ నాయక్, పేరటి యాకూబ్ రెడ్డి, పింగిలి ఉష, మంగళపల్లి రామచంద్రయ్య, జిరుగ సురేందర్ రెడ్డి,చెవిటి సధాకర్, కందాడి అచ్చిరెడ్డి, జలకం శ్రీనివాస్, బాలకృష్ణ, నర్మ్కాటి గజానంద్, దీకొండ మధు, యనమల్ల శ్రీనివాస్, వెలుగు మహేశ్వరి, రాజేష్ యాదవ్, అభిరామ్, మహేష్ యాదవ్, పరుశురాములు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



**గోదావరి ఖని టౌన్** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ దినోత్సవ సందర్భంగా రామగుండం బిజెపి ఆఫీస్ లో వారికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. వారి యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ఒకే దేశంలో రెండు ప్రధానులు రెండు చిహ్నాలు రెండు జెండాలు ఉండకూడదని నినాదాన్ని పార్లమెంటు లో లేవనెత్తి భారతదేశంలో ప్రజలకు చైతన్యం చేసినటువంటి గొప్ప వ్యక్తి శ్యామ ప్రసాద్ ముఖర్జీ వారు కాశ్మీర్లో హిందువుల కోసం మరియు 370 ఆర్టికల్ రద్దు కోసం కూడా పోరాటం చేసిన మొట్టమొదటి వ్యక్తి శ్యామ ప్రసాద్ ముఖర్జీ , వారి జీవితాన్ని దేశానికి త్యాగం చేసి వారి యొక్క మరణం ఇంకా రహస్యంగానే ఉండడం వల్ల మరి ఈరోజు బలిదాన్ దివాస గా వారి యొక్క వర్ధంతిని భారతీయ జనతా పార్టీ జరుపుకుంటుంది ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ సిల్వ లక్ష్మీనారాయణ, శివాజీ, మహిళా మోర్చా నాయకురాలు సోమారపు లావణ్య, మహోవదిరామన్న, పెద్దపల్లి రవీందర్,నవీన్, మేడి రాజు ,శ్రవణ్ ,రాజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ ఒలంపియాడ్‌లో ప్రతిభ చూపిన గీతాంజలి విద్యార్థులు

**- మొగురం వైష్ణవి, ఇల్లందుల రాగమాలిక**

**- అభినందించిన కరస్పాండెంట్ కంది రవిందర్ రెడ్డి**





**గోదావరి ఖని టౌన్ :** దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎస్ఇఎంఎస్ నేషనల్ ఒలంపియాడ్‌లో గీతాంజలి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొగురం వైష్ణవి జాతీయస్థాయిలో సెకండ్ ర్యాంక్, ఇల్లందుల రాగమాలిక స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌తో పాటు బూడిద లాస్య స్టేట్ 6 వ ర్యాంక్ గాజుల స్ఫూర్తి జోనల్ 5 వ ర్యాంక్, ఆరేపల్లి సాత్విక్ జోనల్ 3 వ ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు నేషనల్ ఒలంపియాడ్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన గీతాంజలి విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్ రెడ్డి , ఉపాధ్యాయులు, పోషకులు అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గోడల పైన కుడ్య చిత్రాలు వేయిస్తున్న నగరపాలక సిబ్బంది



**గోదావరి ఖని టౌన్** వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ఐ ఇ సి కార్యకలాపాల్లో లో భాగంగా తడి చెత్త , పొడి చెత్త ఇంటి వద్దనే వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించడం , చెత్త రీ సైకిలింగ్, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కుడ్య చిత్రాలను ( వాల్ ఆర్ట్ ) వేసే పనులు గురువారం శాసన సభ్యుని కార్యాలయం వద్ద ప్రారంభమయ్యాయి. శాసన సభ్యుని కార్యాలయం ప్రహరీ గోడకు వేసిన కుడ్య చిత్రాలను రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి పరిశీలించారు. ఆ తరువాత అక్కడే మున్సిపల్ సిబ్బంది , మెప్మా ఆర్ పి లతో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం చేస్తామని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులు గురువారం కూడా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్ పెక్టర్ కుమార స్వామి , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , వార్డు అధికారులు , అసిస్టెంట్లు , జవాన్లు , మెప్మా ఆర్ పి లు పాల్గొన్నారు.

## మానవత్వం సాటి 40 వేలు విరాళం అందించిన ప్రభుత్వామోదిత పాఠశాలల సంఘం

**- ట్రస్మా ప్రైవేట్ ఉపాధ్యాయులు రమేష్ కుటుంబానికి 40 వేలు విరాళం ఇచ్చిన ట్రస్మా**



**గోదావరి ఖని టౌన్ :** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అనేక పాఠశాలలో హిందీ విషయ భోధకులుగా అనేక సంవత్సరాలు పని చేసిన రమేష్, ప్రస్తుతం ఉషోదయ, సిదార్థ హై స్కూల్స్ లో పని చేస్తు గుండె పోటుతో పరమపదించినారు. అందులకు వారి కుటుంబ సభ్యులను ట్రస్మా రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు సమ్మా రావు ఆధ్వర్యంలో కలిసి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి 40వేలు అందచేసారు ఈ సందర్బంగా ముఖ్య అతిథులు గా హాజరైనా ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ అరుకాల రామశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ రమేష్ లేని లోటు ఎవరు తీర్చలేనిది అని, హింది ఉపాధ్యాయులుగా పాఠశాల విద్యారంగానికి చేసిన కృషి అభినంద నీయమన్నారు. ఇంకను ఈ కార్యక్రమంలో ట్రస్మా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, యం.విజయానందు, పరుపాటి అంజారెడ్డి, చందుపట్ల తిరుపతి రెడ్డి, యస్. వెంకటేశ్వర రావు, ఊర సమ్మి రెడ్డి, భోగా నాగరాజు పాల్గొని సంతాపం ప్రకటించారు.

# అభివృద్ధి పథంలోకి పరుగులు పెడుతున్న రామగుండం

**◆ పలు పనులకు శంకుస్థాపన చేసిన ఎంపి, ఎమ్మెల్యే**





**గోదావరి ఖని టౌన్ :** అభివృద్ధి పథంలో రామగుండం ముందుకు దూసుకుపోతున్నదని ఎం ఎల్ ఏ ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ అన్నారు. రెండు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఎన్ టి పి సి హెలీప్యాడ్ ట్యాంక్ నుండి నర్రశాల పల్లి ప్రభుత్వ పాఠశాల వరకు సి సి రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంఖుస్థాపన చేశారు . ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో రామగుండంలో అన్ని డివిజన్ లలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. రామగుండంలో మూత పడిన జెన్ కో పవర్ హౌస్ స్థానంలో 55 వేల కోట్ల విలువైన విద్యుత్ ప్రాజెక్టు సాధించామని అన్నారు.రామగుండానికి పునర్ వైభవం తెచ్చే విధంగా నవ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. పెద్దపల్లి ఎం పి గడ్డం వంశీ కృష్ణ మాట్లాడుతూ రామగుండం లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. కాకా వెంకట స్వామి కృషితో సింగరేణి కార్మికులకు ఫించను మంజూరయినప్పటికీ నాటి నుండి నేటి వరకు పెరగలేదని దృష్టికి వచ్చిన వెంటనే పార్లమెంట్ లో ప్రస్తావించి ఫించను మొత్తం పెరగడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ ఇ శివానంద్, ఇ ఇ రామన్, తాజా మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, కొలిపాక సుజాత పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దేశ భద్రత, సమగ్రత కోసం తన ప్రాణాలు అర్పించిన గొప్ప నేత శ్యామ ప్రకాశ్ ముఖర్జీ


**◆ బిజేపి రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి**



**గోదావరి ఖని టౌన్ :** డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జనగామ మరియు ఎన్టీపీసీ లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించ బడింది. ఈ కార్యక్రమానికి బిజెపి రామగుండం నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ భద్రత, సమగ్రత కోసం తన ప్రాణాలు అర్పించిన గొప్ప నేత. 'ఒక దేశం ఒక జెండా ఒక రాజ్యాంగం' అనే నినాదంతో ఆయన చేపట్టిన పోరాటం భారతదేశ చరిత్రలో మైలురాయిగా నిలిచింది. కాశ్మీర్‌లో ప్రత్యేక హెూదా వ్యతిరేకంగా, దేశంలో సమానత కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి గర్వకారణం. ఇప్పటి తరానికి ఆయన త్యాగాలు తెలుసుండాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టాం. పర్యావరణ పరిరక్షణ ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనవాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనదే. మొక్కలు నాటడమే ఆయన బలిదానాన్ని స్మరించుకోవడానికి ఒక సముచిత మార్గం," అని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పార్టీ శ్రేణులను సంధ్యారాణి ప్రత్యేకంగా అభినందించారు... ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, ఎన్టీపీసీ మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్ అర్చకులు శ్రీనివాస్ శర్మ గుండెబోయిన వెంకటయ్య , పోలేరాజు, కనకరాజు ,జనగామ సాయిలు, తడగొండ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు..

# డ్రగ్స్ వాడకం యువత వ్యతిరేకించాలి

**◆ చెడు అలవాట్లు,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ◆ డ్రగ్స్‌కు సంబంధించి సమాచారం తెలిస్తే వెంటనే 14446 కు అందించాలి ◆ యాంటి డ్రగ్ క్యాంపెయిన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




**పెద్దపల్లి ప్రతినిధి :** డ్రగ్స్ మత్తు పదార్థాల వాడకాన్ని యువత తీవ్రస్థాయిలో వ్యతిరేకించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో డ్రగ్స్ కు వ్యతిరేకంగా ఏర్పాటు క్యాంపెయిన్ లో చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గోన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఐ యామ్ ఆంటి డ్రగ్ సోల్దియర్ ఫోటో పాయింట్ వద్ద కలెక్టర్ ఫోటో తీసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు.సరదా కోసం ప్రారంభమయ్యే డ్రగ్స్ లాంటి అలవాట్లు మన జీవితాలను నాశనం చేస్తాయని అన్నారు.డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని అన్నారు. డ్రగ్స్ కు బానిసైన వారి కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. డ్రగ్స్ కు సంబంధించి ఎటువంటి సమాచారం తెలిసినా ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ 14446 కు వెంటనే అందించాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులు సరైన మార్గంలో నడిచేలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. పిల్లలు చెడు అలవాట్లు చేసుకోకుండా చూడాలని, ఎప్పుడైనా విచిత్రంగా ప్రవర్తిస్తే వెంటనే దానికి గల కారణాలు తెలుసుకోవాలని, ఏదైనా అలవాట్లు ఉంటే మాన్పించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, వైద్యశాఖలో ఉన్న నిపుణుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల రావు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఐటీ, జేఈఈ, నీట్ సబ్జెక్టు నిపుణులకై దరఖాస్తుల ఆహ్వానం




**తిమ్మాపూర్, జూన్ 25,:** సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సీవోఈ కళాశాలల్లో ఐఐటీ, జేఈఈ, నీట్, సీఎంఏ, క్లాట్ లో తగిన శిక్షణ ఇచ్చేందుకు వృత్తి అర్హత, అనుభవం కలిగిన నిష్ణాతులైన బోధకులను తాత్కాలిక పద్ధతిలో దరఖాస్తులకై ఆహ్వానిస్తూ విద్యాలయాల సంస్థ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసింది.గౌలిదొడ్డి గురుకులం(బాలురు),బాలికల గురుకులం, ఉప్పల్(బాలురు), కరీంనగర్(బాలికలు) నార్సింగి (బాలికలు), షేక్ పేట(బాలురు), మహీంద్రహిల్స్(బాలికలు), ఫలక్ నుమా(బాలికలు), నీట్ కు సంబంధించి చిలుకూరు(బాలురు), సరూర్ నగర్(బాలికలు).సీఎంఏ, క్లాట్ ఇబ్రహీంపట్నం (బాలికలు), హైదరాబాద్(బాలురు) విద్యాలయాల్లో మ్యాథ్స్ 20 పోస్టులు, ఫిజిక్స్ 21, కెమిస్ట్రీ 20, బాటనీ 10, జువాలజీ 9, సీఎంఏ ఫౌండేషన్(అన్ని పేపర్లకు) 4. క్లాట్ (లీగల్లనింగ్ 1, లాజికల్ రీజనింగ్ 1,క్వాంటిటీ టెక్నిక్స్ 1) ఖాళీగా ఉన్నట్లు తెలుపుతూ ఈనెల 27న గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోదకులకు గౌలిదొడ్డి(హైదరాబాద్), 28న బాటనీ, జువాలజీ,సీఎంఏ, క్లాట్ బోదకులకు నార్సింగీ(హైదరాబాద్)లో రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని అర్హత కలిగిన అభ్యర్థులు ధృవపత్రాలతో హాజరైతే ఎంపికైన వారికి అనుభవం ఆధారంగా గంటకు రూ.650 వరకు గౌరవ వేతనం ఉంటుందని వివరాలకు హెల్ప్ లైన్ నం: 0402339159, స్థానిక సిఓఈ అలుగునూర్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి:7337349518 ద్వారా సంప్రదించాలని గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి ప్రకటనలో తెలిపారు.

## బాలసదనం సూపరింటెండెంట్ నియామకాల్లో అవకతవకలు అవాస్తవం

**- జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల రావు**

**పెద్దపల్లి ప్రతినిధి** బాలసదనం సూపరింటెండెంట్ నియామకాల్లో అవకతవకలు అనే ప్రచారంలో ఉన్న వార్తలు అవాస్తవమని జిల్లా సంక్షేమ అధికారి పి. వేణు గోపాల రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అనాధ బాలికల ఆశ్రమం కల్పించడానికి 2021 సంవత్సరంలో ప్రభుత్వం బాలసదనం మంజూరు చేసిందని అన్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల సదనం ప్రారంభించి, జిల్లాలోని అనాధ బాలలు, పాక్షిక అనాధ బాలల వివరాలను సేకరించి వారిలో అవసరం ఉన్న 48 మంది బాలలను బాల సదనంలో చేర్పించామని అన్నారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సూపరింటెండెంట్ తో సహా అన్ని ఉద్యోగాలు అవుట్సోర్సింగ్ లో మాత్రమే మంజూరు అయ్యాయని, 48 మంది పిల్లల ఆలనా పాలన చూసుకోవడానికి 24 గంటల ఉద్యోగుల పర్యవేక్షణ అవసరం ఉందని, ఇందు కోసం ప్రస్తుతం జిల్లా బాలల సంరక్షణ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సర్వీసులను రీ- ఎంగేజ్ చేసుకున్నామని, ఎలాంటి కొత్త నియామకాలు జరగలేదని జిల్లా సంక్షేమ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

## మా భూమిని మాకు ఇప్పించండి



**పెద్దపల్లి ప్రతినిధి :** వారసత్వంగా రావలసిన మా భూమిని ఎక్కువగా పట్టా చేయించుకున్న వారి నుండి మాభూమిని మాకు ఇప్పించాలని పెద్దపల్లి మండలం కొత్తపల్లికి చెందిన నెత్తెట్ల ఓదెలు, సదయ్య, శ్రీనివాస్, రజిత అధికారులను వేడుకున్నారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబరు 369/2/1 లో మాకు ఉండాల్సిన భూమి కంటే తక్కువగా ఉందని వాపోయారు. ఆభూమిని మా బంధువులు అయిన నెత్తెట్ల సదయ్య, బాపు పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. మా భూమిని తిరిగి మాకు పట్టా చేయమంటే నెత్తెట్ల సదయ్య, బాపు, రాజ్ కుమార్ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. మా భూములకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా మాకు న్యాయం జరగడం లేదని, రెవెన్యూ, పోలీసు అధికారులు జోక్యం చేసుకుని మా భూ సమస్య పరిష్కరించాలని కోరారు.

# విశ్వజ



## ఉపవాసం ఇలా చేస్తే ఎన్నో ప్రయోజనాలు - ఈ పొరపాట్లు చేయద్దు..!!

ఉపవాసం గొప్ప ఔషధం. శరీరంలో నిత్యం పోరాటం చేసే అవయవాల పై ఒత్తిడి తగ్గించి ఆరోగ్యం అందిస్తుంది. ఆధ్మాత్మికంగా ఉపవాసం వారంలో ఏదో ఒక రోజు పాటిస్తూ ఉంటారు. అయితే, ఇది సైన్స్ పరంగానూ ఆరోగ్యానికి ఎంతో మంచిది అని నిరూపితం అయింది. అదే సమయంలో ఉపవాసం పేరుతో కొందరు ఎన్నో మినహాయింపులు ఇచ్చేస్తారు. ఖచ్చితమైన నిపుణుల సూచన ల మేరకు ఉపవాసం ఉంటే ఆరోగ్య పరంగా ప్రయోజనాలు అందుతాయి. అదే సమయంలో కొందరికి ఈ ఉపవాసం మంచిది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఉపవాసంలో ఎన్నో ఆరోగ్య రహస్యాలు ఉన్నాయి. వారంలో ఒక రోజు ఉపవాసం ఉండటం ద్వారా అద్భుతమైన లాభాలు ఉన్నాయి. ఇది సైన్స్ పరంగానూ నిరూపితం అయింది. ఉపవాసం కనీసం 12 గంటలు ఉండాలి. దీని కారణంగా కొవ్వు కరిగే ప్రక్రియ పెరుగుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడల దగ్గర ఉండే కొవ్వు కరుగటానికి అవకాశం ఏర్పడుతుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఏదైనా ఒక రోజు వారంలో ఉపవాసం చేస్తే ఆకలి హార్మోన్లు నియంత్రణలోకి వస్తాయని నిపుణులు చెబుతు న్నారు. కాగా, ఉపవాసం కారణంగా క్లోమ గ్రంధి పైన ఒత్తిడి తగ్గి.. శరీరం ఇన్సులిన్‌ను సమర్థవం తంగా ఉపయోగించుకుంటుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలోకి వస్తాయి. అయితే డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ చేసే సమయంలో మందులను వాడకూడదు. లేదంటే షుగర్ లెవల్స్ మరీ అధికంగా పడిపోతే మరింత సమస్యగా మారుతుంది. ఉపవాసం వలన మంచి కొలెస్ట్రాల్ పెరగ టం తో పాటుగా.. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని ద్వారా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. వారంలో ఒక రోజు ఉపవాసం ఉంటే శరీరం తనకు తాను అవసరమైన మార్పులు చేసుకొనే వెసులుబాటు కలుగుతుంది. అవయవాలు మళ్లీ పునరుత్తేజం చెంది యాక్టివ్‌గా మారుతాయి. మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. నీరసం, అలసట దూరం అవుతాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గర్భంతో ఉన్న మహిళలు లేదా పాలిచ్చే తల్లులు ఉపవాసం ఉండడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టైప్ 2 డయాబెటిస్ ఉంటే డాక్టర్ సూచన మేరకు మాత్రమే ఉపవాసం చేయాలి.టైప్ 1 డయాబెటిస్ ఉన్నవారు ఉపవాసం చేయవద్దని నిపుణులు తేల్చి చెబుతున్నారు. కిడ్నీ, లివర్ వ్యాధులు ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు, బీపీ మందులను తీసుకుంటున్నవారితో సహా పోషకాహార లోపం ఉన్నవారికి ఉపవాసం మంచిది కాదు. ఉపవాసం ఉన్న సమయంలో నీళ్లను అధికంగా తాగాలి. ఆకలికి తట్టుకోలేకపోతే తేనె, నిమ్మరసం కలిపిన నీళ్లను తాగుతుండాలి. లేదా కేవలం పండ్లను మాత్రమే తినాలి. ఇలా ఉపవాసం చేస్తే చక్కని ఫలితం ఉంటుంది.

# ఇది డిజిటల్ రామాయణం



దైనందిన జీవితంలో మంచి, చెడు తెలుసుకోవడానికి పురాణ కథలు ప్రేరణగా నిలుస్తాయి. రామాయణ, మహాభారతంలోని దృష్టాంతాలు ఉదహరిస్తే నీతి, నిజాయతీ పిల్లల బుర్రకెక్కుతాయని పెద్దలు ఆ కథలే చెబుతుండేవారు. ఇప్పుడు కథలు ఎక్కడివి? డిజిటల్ మానియాలో కొట్టుకుపోతున్నారంతా! కానీ, ఈ సాంకేతిక ప్రపంచంలో పాటించాల్సిన విధులు, తెలుసుకోవాల్సిన పరిమితులు, పొంచి ఉన్న ప్రమాదాల గురించి ఎన్ని హెచ్చరికలు జారీ అవుతున్నా.. పెడచెవిన పెడుతున్నారు. అందుకే ఈ ప్రయత్నం. రామాయణ పాత్రలతో డిజిటల్ అక్షరాస్యత పెంచుకుందాం.. రాముడుధర్మానికి ప్రతిరూపం. ఆయనలా నీతిగా, నిజాయతీగా ఉండాలంటే.. డిజిటల్ అట్రాక్షన్‌కు గురికాకూడదు. శూర్పణఖ అట్రాక్ట్ చేయడానికి వచ్చినా.. రాముడు విముఖత ప్రదర్శించాడు! రాముడు ఫేక్‌న్యూస్ నమ్మేవాడు కాదు. వనవాసం తొలినాళ్లలో భరతుడు దండెత్తడానికి వస్తున్నాడని లక్ష్మణుడు చెప్పినా.. రాముడు గుడ్డిగా నమ్మలేదు. భరతుడు వచ్చింది తనను తీసుకెళ్లడానికే అని నిజం తర్వాత తేటతెల్లమైంది. రాముడు వివాదాస్పద వ్యాఖ్యలు చేయడు. ఆచితూచి స్పందిస్తాడు. డిజిటల్ భాషలో చెప్పాలంటే రామయ్య ఎథికల్ డిజిటల్ సిటిజన్ అన్నమాట! సోషల్ మీడియా దునియాలో మనం అలా ఉండాలంటే.. నిజ జీవితంలో శ్రీరాముడు పాటించిన విధానాలు ఫాలో అవ్వడమే! హేట్ స్పీచ్ చేయొద్దు, ఫేక్ న్యూస్ నమ్మొద్దు. డేటా భద్రం... సీతమ్మ తల్లే రామచంద్రుడి ప్రాణం! మాయా బంగారు లేడిని పట్టుకునేందుకు రాముడు వెళ్లగానే.. సీతమ్మ భద్రత గాల్లో దీపంగా మారింది. ఇదే అదునుగా రావణుడు ఆ తల్లిని అపహరించాడు. మళ్లీ సీతమ్మను పొందడానికి రామచంద్రుడు యుద్ధమే చేయాల్సి వచ్చింది! ఈ దృష్టాంతాన్ని నేటి డిజిటల్ యుగానికి అన్వయించుకుంటే.. మన డేటా ప్రైవసీ సేఫ్టీ ఎంత ముఖ్యమో తెలుస్తుంది. కాస్త ఏమరుపాటుగా ఉన్నా.. మన డేటా సైబర్ రావణుల చేతికి చిక్కడం ఖాయం. ఫొటోలు, లొకేషన్, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికైనా సులభంగా అందుబాటులో ఉంచితే అది ఓ డిజిటల్ లంకకు మార్గం వేసినట్లే. సోషల్ మీడియాలో 'ఓవర్ షేరింగ్' చేస్తే సైబర్ స్టాకింగ్‌కు దారితీస్తుంది. 'నేను ఇప్పుడు వెకేషన్‌లో ఉన్నాను' అని లొకేషన్ ట్యాగ్‌తో పోస్ట్ చేస్తే, దొంగ రావణులకు మీ ఇల్లు ఖాళీగా ఉందని తెలిసిపోతుంది. ఇంకేముందీ.. మీ ఇల్లు గుల్ల చేస్తారు. సో.. మీ డేటా లేదా డబ్బు చోరీకి గురికాకుండా.. ప్రైవసీ మెయింటేన్ చేయండి. మన డేటాని రక్షించేందుకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్, టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ వాడాలి. పారాహుషార్.. రావణాసురుడు మాయావి, మోసం చేయడంలో నిపుణుడు. ఈ ఆన్‌లైన్ లోకంలో సైబర్ రావణులు ఎవరంటే స్కామర్స్, హ్యాకర్స్! ఫిషింగ్ మెయిల్స్, సోషల్ ఇంజనీరింగ్, ఆన్‌లైన్ గ్రూమింగ్.. ఇవన్నీ రావణుడి ట్రిక్స్ లాంటివే. అందుకే, ఆన్‌లైన్‌లో ఎవరిని పడితే వారిని గుడ్డిగా నమ్మేయకండి. లింక్స్ క్లిక్ చేసేటప్పుడు, మెయిల్స్ ఓపెన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. రావణుడి మాయలో పడకుండా చూసుకోండి! ఫిషింగ్ లింక్స్, ఇ-మెయిల్స్‌ని గుర్తించండి. ఉదాహరణకు, మీరు లాటరీ గెలిచారు, ఈ లింక్ క్లిక్ చేయండి అని వచ్చే మెసేజ్‌లు రావణుడి మాయలే. ఇలాంటి లింక్స్ క్లిక్ చేస్తే మీ డేటా గోవిందా! అనుమానాస్పద ఇ-మెయిల్స్‌ని ఓపెన్ చేయకండి!

ప్రైవసీ సేఫ్టీ లైన్.. లక్ష్మణుడు సీతమ్మను రక్షించేందుకు గీసిన రేఖ గుర్తుందా? ఇది ఆన్‌లైన్‌లో మన ప్రైవసీ సెట్టింగ్స్ సేఫ్టీ లైన్ అన్నమాట. రావణుడు లాంటి సైబర్ క్రిమినల్స్ లోపలికి రాకుండా రక్షణ వలయంలా పని చేస్తుంది. సింపుల్‌గా చెప్పాలంటే.. లక్ష్మణుడు గీసిన గీత మన డిజిటల్ ప్రైవసీ సెట్టింగ్స్‌ను గుర్తుచేస్తుంది. ఎవరికైనా మన అకౌంట్‌లకు యాక్సెస్ ఇవ్వడమంటే ఆ రేఖ దాటి రావడం లాంటిది. ప్రతి యాప్‌లో ప్రైవసీ సెట్టింగ్స్ అప్‌డేట్ చేసుకోవాలి. 'ఒకసారి క్లిక్ చేస్తే ఏమవుతుంది?' అనే నిర్లక్ష్యం మన డేటా భద్రతను చంపేస్తుంది. సోషల్ మీడియాలో ఎవరైనా అసభ్యకరమైన కామెంట్స్ చేస్తే, ఫేక్ అకౌంట్స్ నుంచి స్కామ్ మెసేజ్‌లు వస్తే వెంటనే రిపోర్ట్ చేయాలి. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో రిపోర్ట్ ఆప్షన్ వాడాలి. రామాయణంలో విభీషణుడిలా ధర్మానికి కొమ్ముకాస్తే, ఆన్‌లైన్ కమ్యూనిటీ సేఫ్‌గా ఉంటుంది.

లంక.. ఓ డార్క్ వెబ్... రావణుడి లంక ఆన్‌లైన్ లోకంలో డార్క్ వెబ్‌కి సింబల్. డార్క్ వెబ్ అంటే ఇంటర్నెట్‌లోని అన్‌సేఫ్, ఇల్లీగల్ కార్నర్స్ అన్నీ అక్కడే ఉంటాయి. ఇవి లంకంత ప్రమాదకరమైనవి. హ్యాకింగ్ టూల్స్, చైల్డ్ పోర్నోగ్రఫీ, అక్రమ లావాదేవీలు అన్నీ ఇక్కడే చోటు చేసుకుంటాయి. వాటికి దూరంగా ఉండటమే మన డిజిటల్ భద్రతకు మంచిది. ఇల్లీగల్ కంటెంట్ యాక్సెస్ చేసి లంకలో ప్రవేశిస్తే.. ఆ డార్క్ వెబ్‌లో మీ డేటా, డివైజ్ రిస్క్‌లో పడొచ్చు.

# ఈ ఒక్క పానీయంతో మీకు సూపర్ ఆరోగ్యం!



మన శరీరాన్ని చల్లబరిచి, మనకు ఆరోగ్యాన్ని ఇచ్చే పానీయాలలో మజ్జిగ ఒకటి. మజ్జిగ ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది. మజ్జిగ మన శరీరంలో నిర్జలీకరణ ని నివారిస్తుంది. ప్రతిరోజు మజ్జిగ తాగడం వల్ల మన శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. మజ్జిగలో ఉండే ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా మరియు లాక్టిక్ ఆమ్లం జీర్ణక్రియకు ఎంతగానో దోహదం చేస్తాయి.

**మజ్జిగతో ఆరోగ్య ప్రయోజనాలు**

మజ్జిగ మన జీవక్రియను పెంచుతాయి. క్రమం తప్పకుండా పేగు కదలికలకు ప్రోత్సాహాన్ని ఇస్తాయి. మజ్జిగ మలబద్ధకాన్ని, కడుపులో తిప్పడం వంటి లక్షణాలను బాగా తగ్గిస్తుంది. మజ్జిగలో క్యాలరీలు మరియు కొవ్వు తక్కువగా ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారు మజ్జిగను ఒక మంచి ఎంపికగా చేసుకోవచ్చు. మన బరువును నియంత్రించడానికి కూడా మంచిగా ఎంతో బాగా ఉపయోగపడుతుంది.

**మజ్జిగతో డీ హైడ్రేషన్ కు చెక్**

మజ్జిగలో నీరు మరియు పొటాషియం అంటే ఎలక్ట్రోలైట్ లు ఉండడం వల్ల ఇవి శరీరంలోని నీటి సమతుల్యతను కాపాడటానికి దోహదం చేస్తాయి. ఫలితంగా శరీరం డీహైడ్రేషన్ కాకుండా మజ్జిగ కాపాడుతుంది. మజ్జిగలో రిబోఫ్లేవిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఇది ఇందులో ఉండే అమైనో ఆమ్లాలను నియంత్రిస్తుంది. మజ్జిగ రోజంతా మనల్ని చురుగ్గా ఉండేలా చేస్తుంది.

**మజ్జిగతో కాలేయ ఆరోగ్యం**

మజ్జిగలో పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఇది రక్తపోటును నియంత్రించడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. మజ్జిగ క్యాల్షియం మరియు విటమిన్ డి లకు మంచి మూలం కావడంతో ఎముకలకు మంచి బలాన్ని ఇస్తుంది. మజ్జిగ కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కాలేయం యొక్క మరమ్మతుకు పునరుత్పత్తికి మజ్జిగ సహాయపడుతుంది. మజ్జిగలోని ప్రోబయోటిక్స్ శరీరంలోని హానికరమైన కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడతాయి.

**మజ్జిగతో పేగు ఆరోగ్యం, చర్మ ఆరోగ్యం**

మజ్జిగ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. కడుపులో మంటను తగ్గించి గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మజ్జిగ ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. మజ్జిగ వేడి వాతావరణంలో శరీరాన్ని రిఫ్రెష్ చేయడమే కాకుండా శరీరాన్ని చల్లబరిచి ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది.

# మార్కెట్

## దేశంలో 30కోట్ల 5జీ కస్టమర్లు


### స్మార్ట్‌ఫోన్లలో రోజుకు 1జీబీకిపైగానే డాటా వినియోగం

### ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్ట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ : గత ఏడాది చివరి నాటికి దేశంలో 5జీ వినియోగదారులు 29 కోట్లకు చేరారని మంగళవారం విడుదలైన ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్టులో తేలింది. మొత్తం భారతీయ మొబైల్ వినియోగదారుల్లో ఇది 24 శాతమని పేర్కొన్నది. అలాగే ఒక్కో స్మార్ట్‌ఫోన్ యూజర్ నెలకు 32 జీబీ డాటాను వాడుకున్నారని ఈ తాజా నివేదికలో ఎరిక్సన్ స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే 2030కల్లా ఇంచుమించుగా మూడురెట్లు పెరిగి దేశీయ 5జీ సబ్‌స్క్రైబర్లు దాదాపు 98 కోట్లకు చేరుకోవచ్చని (దేశీయ మొబైల్ వాడకందారుల్లో 75 శాతం), నెలకు స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల డాటా వాడకం 62 జీబీని తాకవచ్చని అంచనా వేసింది. ఇక 2030 నాటికి దేశంలో 4జీ కస్టమర్లు ప్రస్తుతంతో పోల్చితే సుమారు 60 శాతం పడిపోయి 23 కోట్లకు పరిమితం కావచ్చంటూ ఈ అప్‌డేటెడ్ రిపోర్టులో స్వీడిష్ టెలికం కంపెనీ చెప్పింది. నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన రిపోర్టులో 2030 నాటికి దేశంలో 5జీ యూజర్లు 97 కోట్లకు పెరగవచ్చని, 4జీ కస్టమర్లు 24 కోట్లుగా ఉంటారని అంచనా వేసింది. నెలవారీ డాటా వినియోగం కూడా స్మార్ట్‌ఫోన్‌కు 66 జీబీగా ఉండొచ్చన్నది. అయితే తాజా నివేదికలో ఈ నెంబర్లను సవరించింది.




# మరోసారి లేఆఫ్స్‌కు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. !




ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130కిపైగా కంపెనీలు దాదాపు 61 వేల మందికి పైగా ద్యోగులను తొలగించాయి. ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సంస్థ సిద్ధమవుతున్నట్లు తెలిసింది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. వచ్చే వారం ప్రారంభంలో లేఆఫ్స్ గురించి సంస్థ ప్రకటించే అవకాశం ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. వేలాది మందిపై ఈ ప్రభావం ఉండనున్నట్లు సమాచారం. తాజా లేఆఫ్సలు %శఎశీఇ% విభాగంలో (%శఎశీఇ ుఱజుఱంఱశీఅ%) ఉండనున్నట్లు సమాచారం. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. వరుస లేఆఫ్స్‌తో సంస్థలోని ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

## సాఫ్రాన్ ఫైటర్ జెట్ సెంటర్

హైదరాబాద్ : ఫ్రెంచ్‌కు చెందిన విమాన ఇంజిన్ల తయారీ సంస్థ సాఫ్రాన్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో వందేండ్లకుపైగా చరిత్ర ఉన్న సాఫ్రాన్.. హైదరాబాద్‌లో ఇప్పటికే రెండు ప్రపంచస్థాయి ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో సాఫ్రాన్ జనరల్ మేనేజర్ పియరీ ఫెర్నాండెజ్ కొత్త పెట్టుబడులను ప్రతిపాదించారు. నూతనంగా ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ కేంద్రాన్ని నెలకొల్పబోతున్నట్టు ఆయన ప్రకటించారు. రఫేల్, ఎం 88 ఫైటర్ జెట్ ఇంజిన్ల నిర్వహణ, ఓవర్ హాలింగ్ పనులు ఇక్కడే నిర్వహించడానికి వీలు పడనున్నదన్నారు. తద్వారా వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 150 మందికి ఉద్యోగ అవకాశాలు లభించను న్నాయని, అనంతరం దశలవారీగా మరో 750 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానాల ఇంజిన్లకు కీలక విడిభాగాలను తయారు చేస్తున్న సాఫ్రాన్ .. ఇకడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నది కూడా. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని ఇఫీ ప్రతినిధులను కోరారు. అందిస్తున్న ప్రోత్సాహ కాలను ఆయన వివరించారు. 'తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితోనే సీఎం రేవంత్ రెడ్డి 30 వేల ఎకరాల్లో పీపీపీ విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని, అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఈ నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ సంకల్పమన్నారు.

# స్వతంత్ర భారత చరిత్రలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయం

**అప్పటి కాంగ్రెస్ అధికార దాహానికి నిదర్శనం**

**జనసేనాని, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



అమరావతి,జూన్25 : 1975 జూన్ 25న విధించిన ఎమర్జెన్సీ స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత చీకటి అధ్యాయాలలో ఒకటని.. ఇది కేవలం ఒక రాజకీయ సంఘటన కాదు.. ఇది రాజ్యాంగానికి ప్రత్యక్ష ద్రోహమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం.. అప్పటి కాంగ్రెస్ నాయకత్వం అధికార దాహానికి చిహ్నామని అన్నారు. పత్రికలను అణచివేశారని, ప్రతిపక్షాల గొంతు నొక్కివేశారని, ప్రాథమిక హక్కులను నిలిపివేశారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్, అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె.అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్, మొరార్జీ దేశాయ్ వంటి గొప్ప నాయకులు అనేక మంది ప్రజాస్వామ్య రక్షణ కోసం నిలబడి జైలు పాలయ్యారని పవన్ కల్యాణ అన్నారు. ఈ రాజ్యాంగ ద్రోహానికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియంతృత్వానికి వ్యతిరేకంగా నిర్భయంగా నిలబడి మన ప్రజాస్వామ్య గౌరవాన్ని నిలబెట్టిన వారి త్యాగాలను గుర్తు చేసుకోవడానికి 'సంవిధాన్ హత్య దివస్'ను పాటిస్తామని అన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన నాయకుడు చేసిన త్యాగాలను, వారి గొంతులను అణచివేసిన లక్షలాది మంది వేదనను గుర్తుచేసుకుం దామన్నారు. నేటికీ, రాజకీయాల పేరుతో మన రాజ్యాంగాన్ని రాజీ చేసే ఏ ప్రయత్నానికైనా దూరంగా ఉండాలని పవన్ కల్యాణ్ అన్నారు. యాభై సంవత్సరాల క్రితం 1975లో అప్పటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 21 నెలల పాటు దేశంలో అత్యయికస్థితిని (ఎమ్జ్గ÷న్సీ) విధించారు. ఆమె తీసుకున్న ఈ నిరంకుశ నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ప్రజాస్వామ్యవాదుల్లో ఆందోళనలు రేకెత్తించింది. భారతదేశం వలస పాలన సంకెళ్లను తెంచుకున్న తర్వాత, మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ రూపంలో తీవ్రమైన ముప్పు ఎదురైంది. రాజకీయ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలందరి జీవితాలలో అది చేదు సమయం. ప్రతిపక్ష నాయకులను అణచివేయడమే లక్ష్యంగా ఇందిరాగాంధీ యంత్రాంగం పనిచేసింది. వందలాది ప్రతిపక్ష నేతలను, వేల మంది కార్యకర్తలను కారాగారాల్లో నిర్బంధించింది. పౌరహక్కులకు, ప్రాథమిక హక్కులకు పాతరేసింది. భావప్రకటన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించివేసింది. శాంతియుతంగా నిరసనలు తెలియజేయడానికి కూడా ఎక్కడా ఎవరూ గుమిగూడడానికి వీల్లేకుండా చేసింది. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసింది. సెన్సార్‌షిప్ విధించింది. ఆఖరుకు న్యాయవ్యవస్థ స్వతంత్రతకు కూడా క్లెం వేయడానికి ప్రయత్నించింది. చెప్పినట్లు నడచుకునే న్యాయమూర్తులను, సీనియారిటీని కాదని ఎంచుకుంది. ఇవన్నీ మునుపెన్నడూ లేని నిరంకుశ చర్యలు. ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమించే ఒక ప్రమాదకర ధోరణికి ఇందిరాగాంధీ మార్గం వేశారని గుర్తు చేశారు.

# అరాచకం సృష్టిస్తానంటే చూస్తూ ఊరుకోం

**రాష్ట్రంలో అశాంతి నెలకొల్పే కుట్రలను సహించం**

**వైకాపాకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరిక**



రాయచోటి,జూన్25 : వైసీపీ నాయకులు, కార్యకర్తలు జగన్మోహన్ రెడ్డి మాటలు విని ప్రజల జోలికి వస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు అంటూ వార్నింగ్ ఇచ్చారు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అశాంతి నెలకొల్పేందుకు రెచ్చగొట్టే కార్యక్రమాన్ని నిర్వహించే వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.. వైసీపీ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరామర్శల పేరుతో మందీమార్బలంతో వెళ్లి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు.. విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో 75 ఏళ్ల వయసులో 12 రోజులు ప్రజల మధ్యనే ఉండి ఆదుకున్న నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు? వరద కష్టాలు తెలిసిన ప్రజలను పరామర్శించకుండా బెంగళూరుకు పారిపోయిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు.. ఇప్పుడు కార్యకర్త చనిపోయారని సాకు పెట్టుకుని ప్రజలలో దండయాత్రగా వెళ్లి అంతు చూస్తామని సినిమా పోస్టర్లు వేయించుకుంటున్నాడు? ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని మండిపడ్డారు. గత ఐదేళ్లలో పాలకులు చేసిన పాపాలు ఎలా ఉన్నాయి.. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని సూచించారు రాంప్రసాద్‌రెడ్డి.. గత 10 రోజులలో రాష్ట్రంలోని 64 లక్షల మందికి రూ.8500 కోట్లు ఖాతాలలో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని వెల్లడించిన ఆయన.. ప్రభుత్వ కార్యక్రమాలు చూసి వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి కి కడుపు మండే రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నాడు అని దుయ్యబట్టారు.. వైసీపీ నాయకులు, కార్యకర్తలు జగన్మోహన్ రెడ్డి మాటలు విని ప్రజల జోలికి వస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు? వైసీపీ గుండాలు జైలలో పడితే వాళ్లను పరామర్శించడానికి జగన్ వెళ్తారు.. తప్పా ప్రజల కోసం ఏనాడు జనంలోకి రాలేదు అని ఎద్దేవా చేశారు.. వైసీపీ అరాచకాలను ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు.. చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకుంటుంది.. రాబోయే రోజుల్లో ఇచ్చిన మాట ప్రకారం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందన్నారు.

# జర్నలిస్ట్ కృష్ణంరాజు బెయిల్ పిటిషన్‌పై విచారణ

**వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు అందించాలని ఆదేశం**

**విచారణ శుక్రవారానికి వాయిదా**

అమరావతి,జూన్ 25 : జర్నలిస్టు కృష్ణంరాజు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. కృష్ణంరాజు మాట్లాడిన వీడియోలు తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బెయిల్ పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి న్యాయస్థానం వాయిదా వేసింది. అయితే.. అమరావతిపై సాక్షి ఛానల్ డిబేట్‌లో కృష్ణంరాజు అనుచిత వ్యాఖ్యలు చేశారు. అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో ఆయనను తుళ్లూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ సమయంలో పిటిషనర్ తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్ బాబు వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని న్యాయస్థానానికి తెలిపారు. అయినప్పటికీ మేజిస్ట్రేట్ జ్యుడీషియల్ కస్టడీ విధించారని గుర్తుచేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చారని అన్నారు. మహిళలను అవమానపరిచేలా పిటిషనర్ వ్యాఖ్యలు ఉన్నాయని వివరించారు. ఏ2గా ఉన్న కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేసిన అనంతరం తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ జర్నలిస్టు కృష్ణంరాజు ప్రజలను రెచ్చగొట్టేలా మరో వీడియో విడుదల చేశారని మెండ లక్ష్మీనారాయణ వెల్లడించారు. మరోవైపు.. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై తుళ్లూరు పోలీసులు పెట్టిన కేసును ప్రధాన కేసుగా పరిగణించాలని ఏపీ పోలీసులకు ఏపీ హైకోర్టు ఆదేశించింది. అనుచిత వ్యాఖ్యలపై ఏపీ వ్యాప్తంగా నమోదైన ఇతర కేసులను స్టేట్‌మెంట్లుగా నమోదు చేయాలని సూచించింది.

# హస్తకళలపై సావనీర్ డిజైన్ పోటీలు

**లేపాక్షి చైర్మన్ డా. పి.హరిప్రసాద్.**

విజయవాడ,జూన్25 : చేనేత హస్త కళాకారులు, కార్మికులు, డిజైన్స్, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మక అభిరుచి కలిగిన ఔత్సాహికుల నుండి హస్తకళల పై సావనీర్ డిజైన్ పోటీలలో పాల్గొనేందుకు దరకాస్తులు కోరుతూ అవకాశం కల్పిస్తున్నట్లు ఆంధ్రప్రదశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలోని సాంప్రదాయ హ్యాండీక్రాఫ్ట్‌లు, హ్యాండ్లూమ్స్‌లలో కొత్త సావనీర్ డిజైన్లను సృష్టించేందుకు జాతీయ డిజైన్ సంస్థ రాష్ట్ర స్థాయి డిజైన్ పోటీలను నిర్వహించన్నట్లు ఆయన తెలిపారు. 8 సంవత్సరాల వయస్సు పైబడి రాష్ట్రానికి చెందిన కళాకారులు, వీవర్స్, డిజైనర్లు, విద్యార్థులు ప్రజలు పోటీలలో పాల్గొన వచ్చునని తెలిపారు. హస్తకళలపై సామర్థ్యాన్ని పెంచడం, సాంప్రదాయ కళాకృతులు, ఆధునిక డిజైన్లను కలిపిన కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్‌కు సంబంధించి ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన కొండపల్లి బొమ్మలు, అనకాపల్లి జిల్లాకు చెందిన ఎటికొప్పాక బొమ్మలు, తిరుపతి జిల్లాకు చెందిన చెక్కతో చెక్కవేతనం, కృష్ణా జిల్లాకు చెందిన కళంకారి బ్లాక్ ప్రింట్స్, శ్రీసత్య సాయిజిల్లాకు చెందిన చర్మపప్పేట్రీ అంశాలపై ధర్మవరం సిల్క్, ఉప్పాడ సిల్క్, వెస్ట్ కోట్స్, మంగళగిరి, బందర్, రాజమహేంద్రవరం, కృష్ణ, తూర్పు గోదావరి జిల్లాల హ్యాండ్లూమ్స్‌లపై పోటీలను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. హ్యాండీక్రాఫ్ట్ ఆంధప్రదేశ్ సావ్‌నీర్‌లలో న్యూమాటిక్, ఆటోమేషన్, కొత్త డిజైన్లను హ్యాండ్లూమ్స్‌లో పాల్స్, స్కార్ఫ్, టైస్, వైస్ట్ కోట్స్ వంటి ఉపయుక్త వస్తువులను పరిచడం చేయాలన్నదే పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. ÷రిళిటీలలో వివిధ విభాగాలకు చెందిన ముగ్గురు ఉత్తమ విజేతలకు నగదు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, హ్యాండీక్రాఫ్ట్, హ్యాండ్లూమ్స్‌లలో ఒక్కొక్క విభాగంలో ఐదుగురు మొత్తంగా పదిమందికి మొదటి బహుమతిగా 25 వేల రూపాయలు, రెండవ బహుమతిగా 15 వేల రూపాయలు, మూడవ బహుమతిగా 10 వేల రూపాయలను పారితోషకంగా అందించడం జరుగుతుందన్నారు. జూలై 16వ తేదీ లోగా కొత్తగా సృష్టించిన సావనీర్ సమూనాలను రాష్ట్రంలోని సమీప లేపాక్షి, ఆప్కో షోరూమ్‌లలో సమర్పించాలన్నారు. పోటీల పక్రియను లేపాక్షి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం విశ్వ పర్యవేక్షిస్తారన్నారు.

# విశిష్ట రాజ్యాంగంతో విశ్వగురుగా అఖండ భారత్

**ప్రజాస్వామ్య స్ఫూర్తితో యువత ముందడుగు వేయాలి**

**రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదీ**

**సంవిధాన్ హత్యా దివస్ ర్యాలీలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




విజయవాడ,జూన్25 : విశిష్ట రాజ్యాంగంతో బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థతో భారత్‌కు విశ్వగురుగా ఎదిగే సత్తా ఉందని.. ఇందుకు ప్రతిఒక్కరూ ముఖ్యంగా యువత మద్దతుతో ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం సంవిధాన్ హత్యా దివస్ నేపథ్యంలో విజయవాడ పాత జీజీహెచ్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు..సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు,అధికారులతో కలిసి ప్రారంభించారు. ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి.. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేద్దాం.. చీకటి రోజులు రానివ్వం.. రానివ్వం, చేయిచేయి కలుపుతాం.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెబుతాం.. అంటూ ప్రజాస్వామ్య వాదులు, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది చేసిన నినాదాలతో ఆసుపత్రి దారిపొడుగునా ర్యాలీ హోరెత్తింది. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెప్పేలా, ఎమ్జ్గ÷న్సీ నాటి పరిస్థితులపై అవగాహన కల్పించేలా కళాకారుల ప్రదర్శనలు దేశభక్తిని, రాజ్యాంగ విలువల గొప్పదనాన్ని ప్రతిబింబింపజేశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతలు బలమైన, అత్యున్నత రాజ్యాంగాన్ని మనకు గొప్ప బహుమతిని ఇచ్చారని.. రాజ్యాంగ ఔన్నత్యంపై ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు, రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్న విషయాన్ని తెలియజేసేందుకు సంవిధాన్ హత్యా దివస్.. ప్రజాస్వామ్య యాత్రను నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్జ్గ÷న్సీ పరిస్థితులు భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రాథమిక హక్కులకు ఎలా భంగం కలిగించాయో, మానవ హక్కుల ఉల్లంఘనకు ఏ విధంగా కారణమయ్యాయనే విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఎన్నో ప్రాణ త్యాగాల ఫలితమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ఎమర్జెన్సీ వంటి చీకటి రోజులు మరెప్పుడూ రాకూడదని గొంతెత్తుదామని.. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేందుకు చేయిచేయి కలుపుతూ ముందడుగు వేద్దామని పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. ఎంతో శ్రమ, పరిశోధన చేసి బాబా సాహెబ్ డా. బీఆర్ అంబేద్కర్ ఎంతో ఘనమైన రాజ్యాంగాన్ని అందించారని, దురదృష్టవశాత్తు ఎమ్జ్గ÷న్సీ విధించడం ప్రజలను కలచివేసిందని పేర్కొన్నారు. ఎందరో ప్రజాస్వామ్య వాదులు జైల్లో మగ్గాల్సిన పరిస్థితి ఎదురైందని.. ఇలాంటి సందర్భాలు మరెప్పుడూ రాకూడదని పేర్కొన్నారు. సహనశీల దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన పరిస్థితి ఎదురుకాకూడదని సీపీ రాజశేఖర బాబు అన్నారు. ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమాలు: రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు మాట్లాడుతూ 1975, జూన్ 25న దేశంలో అత్యవసర పరిస్థితి విధించారని.. దీంతో పౌర హక్కులు, పత్రికాస్వేచ్ఛ హరించబడిందని పేర్కొన్నారు. మన దేశం ప్రజాస్వామ్యానికి పెట్టని కోట అని, ప్రజాస్వామ్య పరిరక్షణకు అహర్నిశలు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో భాగంగా ఈ రోజు నుంచి ఏడాదిపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డా. కొల్లేటి రమేష్, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, పర్యాటక అధికారి ఎ.శిల్ప, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, క్రీడల అభివృద్ధి అదికారి ఎస్ఏ అజీజ్, డీసీపీ కేజీవీ వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

# కొనసాగుతున్న ఆపరేషన్ 'సింధు'

న్యూఢిల్లీ : ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ సింధు' కొనసాగుతోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని స్వదేశానికి తీసుకొస్తోంది. పొరుగు దేశాలకు చెందిన పౌరులకు కూడా భారత్ ఆపరేషన్ సింధు ద్వారా సాయం చేస్తోంది. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటికే పలువురు భారతీయులు స్వదేశానికి చేరుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇజ్రాయెల్ నుంచి 224 మంది భారతీయులతో కూడిన భారత వాయుసేనకు చెందిన విమానం ఢిల్లీకి చేరుకుంది. వారికి పాలెం విమానాశ్రయంలో అధికారులు స్వాగతం పలికారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి ఇప్పటి వరకూ 818 మందిని కేంద్రం స్వదేశానికి తరలించింది. మరోవైపు ఇరాన్ నుంచి 11వ విమానం ఇవాళ తెల్లవారుజామున ఢిల్లీలో ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. 282 మంది భారతీయులు క్షేమంగా స్వదేశానికి తిరిగొచ్చారు. 'జూన్25న తెల్లవారుజామున మాషా (ఇరాన్) నుంచి 282 మంది భారతీయులతో ప్రత్యేక విమానం ఢిల్లీకి చేరుకుంది. దీంతో ఇప్పటి వరకూ ఇరాన్ నుంచి 2,858 మందిని స్వదేశానికి తీసుకొచ్చాం' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఇందులో పొరుగు దేశాలైన నేపాల్, శ్రీలంకకు చెందిన వారు కూడా ఉన్నారు.

# సురక్షితంగా తిరిగొచ్చిన ఫాల్కన్-9

న్యూఢిల్లీ, జూన్25 : ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి నలుగురు వ్యోమగాములను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లిన స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ భూమికి సురక్షితంగా తిరిగి వచ్చింది. ప్రయోగం చేపట్టిన ఎనిమిది నిమిషాల్లోనే ఈ రాకెట్ భూమికి చేరింది. వ్యోమగాములతో కూడిన క్రూ డ్రాగన్ క్యాప్సూల్ ఐఎస్ఎస్‌కు వెళ్లే మార్గంలో నిర్ణీత సమయానికి ఫాల్కన్ 9 రాకెట్ నుంచి విడిపోయింది. అనంతరం ఫాల్కన్ రాకెట్ తిరిగి సురక్షితంగా భూమికి చేరింది. ఈ క్యాప్సూల్ దాదాపు 28 గంటల పాటు ప్రయాణించి రేపు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఐఎస్ఎస్ కు చేరుకుంటుంది. సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానమవుతుందని స్పేస్‌ఎక్స్ శాస్త్రవేత్తలు తెలిపారు. స్పేస్‌ఎక్స్ కంపెనీ తయారుచేసిన ఈ ఫాల్కన్ 9 రాకెట్ ప్రపంచంలోనే తొలి ఆర్బిటల్-క్లాస్ పునర్వినియోగ రాకెట్. భారతీయులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత వ్యోమగామి శుభాన్షు శుక్లారోదసి యాత్ర ఎట్టకేలకు ప్రారంభమైంది. 'యాక్సియం-4' మిషన్‌లో భాగంగా శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరి వెళ్లారు. వీరు ప్రయాణిస్తున్న ఫాల్కన్-9 రాకెట్ ఫ్లోరిడాలోని నాసాకు చెందిన కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12:01 గంటలకు ఈ ప్రయోగం జరిగింది. ఈ వ్యోమనౌక గురువారం సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం కానుంది. 14 రోజులపాటూ వ్యోమగాములు అంతరిక్షంలో ఉండనున్నారు. నాసా సహకారంతో శుక్లా ఐఎస్ఎస్‌లో వివిధ శాస్త్రీయ పరిశోధనలు చేయనున్నారు. ఈ మిషన్‌కు శుక్లా పైలట్‌గా వ్యవహరిస్తున్నారు.

# తెలంగాణలో విద్యావ్యవస్థ మరింత పటిష్టం

**అదనపు కలెక్టర్లు పాఠశాలలను సందర్శించాలి**

**కొత్తగా చేరుతున్న పిల్లలకు అనుగుణంగా సౌకర్యాల కల్పన**

**అధికారులకు సూచించిన సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్,జూన్25(ఆర్ఎన్ఎ): తెలంగాణలో విద్యా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలనుకమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీకరేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలనుం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీకరేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీకరేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీస సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీకరేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నదని అన్నారు. అదనపు కలెక్టర్లు వారంలో కనీసం రెండు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని సీఎం సూచించారు. కమాండ్ కంట్రోల్ కార్యాల్యంలో విద్యాశాఖపై సీఎం సమీకచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి,






## పాండ్యతో డేటింగ్‌పై స్పందించిన నటి ఇషా

టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యతో బాలీవుడ్ నటి ఇషా గుప్తా డేటింగ్‌లో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఎట్టకేలకు స్పందించింది నటి ఇషా గుప్తా. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఇషా గుప్తా మాట్లాడుతూ.. అవును, మేమిద్దరం కొంతకాలం మాట్లాడుకున్నాం. కానీ మేము డేటింగ్ చేశామని నేను అనుకోవడం లేదు. కొన్ని నెలల పాటు మా మధ్య సంభాషణలు జరిగాయి. బహుశా ఇది జరగవచ్చేమో, లేదా జరగకపోవచ్చేమో అన్న దశలో ఉండేవాళ్లం. మేం డేటింగ్ దశకు చేరుకోకముందే అది ముగిసిపోయింది. కాబట్టి దాన్ని డేటింగ్ అని చెప్పలేం అని వివరించారు. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, మనస్పర్థలు కూడా రాలేదని.. అయితే మేము కలవడం అనేది రాసిపెట్టిలేదని తెలిపారు. మేమిద్దరూ చాలా భిన్నమైన వ్యక్తులమని, అందుకే విషయాలు ముందుకు సాగలేదని ఇషా చెప్పుకోచ్చారు.



## టాలీవుడ్‌లో కనిపించని బేబమ్మ

ఉప్పెన సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది ఈ వయ్యారి. బ్యాక్ టూ బ్యాక్ హిట్ సినిమాలతో ఆకట్టుకుంది. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో హ్యాట్రిక్ హిట్స్ ఖాతాలో వేసుకుంది ఈ వయ్యారి. తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. అయితే వరుసగా మూడు హిట్స్ ఖాతాలో వేసుకున్న ఈ వయ్యారి.. ఆ తర్వాత ఆమె కెరీర్ ఊహించని విధంగా మారిపోయింది. వరుసగా హ్యాట్రిక్స్ హిట్స్ అందుకున్న మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, మనమే వంటి సినిమాలు వరుస ఫ్లాపులు పడ్డాయి. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం జస్ట్ ఫర్ ఛేంజ్ చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాతో అక్కడ బేబమ్మకు మంచి క్రేజ్ వచ్చేసింది. ఇక ఇప్పుడు తమిళంలోనూ అవకాశాలు అందుకుంటుంది. కార్తీ సరసన వా వాతియార్ సినిమాలో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ విడుదల కావాల్సి ఉండగా అనుహ్యంగా వాయిదా పడింది. అలాగే తమిళంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తుంది. ఈ మూవీ సెప్టెంబర్ 18న అడియన్స్ ముందుకు రానుంది. వీటితోపాటు జీని అనే తమిళంలో చిత్రంలో నటిస్తుంది. ఇవే కాకుండా బేబమ్మకు తమిళంతోపాటు మలయాళంలోనూ మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా మరో క్రేజ్ ఛాన్స్ కొట్టేసింది. పృథ్వీరాజ్ సుకుమార్ రూపొందిస్తున్న ఖలీఫా చిత్రంలో ఈ అమ్మడు కనిపించే ఛాన్స్ ఉన్నట్లు టాక్. 2022లోనే ఈ మూవీ ప్రకటన వచ్చినప్పటికీ .. పృథ్వీరాజ్ వరుస సినిమాలతో బిజీగా ఉండడంతో సినిమా ఆలస్యమయ్యింది. ఇక ఇప్పుడు జూలై నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది.

## భారీ సినిమా నుంచి శ్రీలీల అవుట్

ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ బ్యూటీగా దూసుకుపోతుంది అందాల భామ శ్రీలీల. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి మెప్పిస్తుంది. పెళ్లి సందడి సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు పరిచయమైంది శ్రీలీల. తొలి సినిమానే దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో చేసింది ఈ చిన్నది. ఆతర్వాత మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన ధమాకా సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. కానీ ఆ తర్వాత శ్రీలీల చేసిన సినిమాలేవీ బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని సాధించలేకపోయాయి. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందుకున్నప్పటికీ ఈ అమ్మడి అనుకున్నంత సక్సెస్ మాత్రం రాలేదు. భగవంత్ కేసరి సినిమా హిట్ అయినప్పటికీ ఆ హిట్ బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. మహేష్ బాబు గుంటూరు కారం సినిమాలో నటించినా కూడా ఆ సినిమా కూడా నిరాశపరిచింది. చివరగా నితిన్ తో రాబిన్ హుడ్ సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా నిరాశపరిచింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటిస్తుంది ఈ అమ్మడు. అలాగే అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న లెనిన్ అనే సినిమాలోనూ హీరోయిన్ గా నటిస్తుంది. మొన్నామధ్య ఈ సినిమా నుంచి పోస్టర్ ను కూడా విడుదల చేశారు. అయితే ఇప్పుడు అఖిల్ సినిమా నుంచి శ్రీలీల తప్పుకుందని తెలుస్తుంది.



## ఆ స్టార్ హీరోయిన్ బాత్రూమ్‌లో నా ఫొటో ఉండేది : సల్మాన్‌ఖాన్


బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. రీసెంట్ డేస్ లో సల్మాన్ ఖాన్ నటించిన సినిమాలు వందకోట్ల మార్క్ ను దాటేశాయి. కాగా హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసి మెప్పిస్తున్నారు. ఇటీవలే మురగదాస్ తో కలిసి సికిందర్ అనే సినిమా చేశాడు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. అలాగే కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటించింది. ఇప్పుడు సల్మాన్ తన సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. 50 వయసు దాటినా కూడా సల్మాన్ ఖాన్ పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్ గా ఉన్నాడు. అంతే కాదు ఈమధ్య సల్మాన్ ఖాన్ ను చంపేస్తామని ఓ గ్యాంగ్ బెదిరిస్తున్న విషయం తెలిసిందే.. ఇదిలా ఉంటే తాజాగా సల్మాన్ ఖాన్ కపిల్ శర్మ షోకు గెస్ట్ గా హాజరయ్యాడు. ఈ షోలో ఆయన ఆసక్తికర కామెంట్స్ చేశాడు. ఈ షోలో సల్మాన్ ఖాన్ ఫోటోలను ఫ్లెక్సీల్లో, రోడ్డుపక్కన, సెలూన్ షాప్స్ లో ఎలా వాడుకుంటారో ఫోటోలు వేసి చూపించారు. ఈ ఫోటోలకు స్లామం పడిపడి నవ్వుకున్నాడు. అలాగే ఆయన మాట్లాడుతూ హీరోయిన్ కరీనా కపూర్ బాత్రూమ్‌లో కూడా నా పోస్టర్ ఉందని విన్నాను. నేను ఒకసారి వల్ల ఇంటికి కూడా వెళ్లి చూశా.. అప్పుడు ఆమె వయసు 8 ఏళ్ళు ఉంటాయి. ఆతర్వాత ఆమెకు 15 ఏళ్ళు వచ్చాకా నా పోస్టర్ తీసేసి రాహుల్ రాయ్ పోస్టర్ పెట్టుకుంది అని చెప్పుకొచ్చాడు.



## గంగూలీ బయోపిక్‌లో రాజ్‌కుమార్

### సినిమా ఎప్పుడు ప్రారంభమంటే..?

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ జీవిత చరిత్ర ఆధారంగా ఓ బయెపిక్ రాబోతున్న విషయం తెలిసిందే. ఈ బయెపిక్‌కి సంబంధించి తాజాగా అప్‌డేట్ వచ్చింది. గత కొన్నేళ్లుగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. గంగూలీ పాత్రలో ఎవరు నటిస్తారనే దానిపై రణ్‌బీర్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా వంటి పలువురు నటుల పేర్లు వినిపించాయి అయితే చివరిగా ఆ అవకాశం బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావుకి దక్కింది. గంగూలీ బయోపిక్‌లో రాజ్ కుమార్ రావుని చిత్రయూనిట్ ఖరారు చేసినట్లు తెలుస్తుంది. దీనిపై అధికారిక ప్రకటన రావడమే తరువాయి. మరోవైపు ఈ ప్రాజెక్ట్ గురించి సౌరవ్ గంగూలీ మాట్లాడుతూ, తన బయోపిక్ పనులు వేగంగా జరుగుతున్నాయని, 2026 జనవరిలో షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. అదే ఏడాది డిసెంబర్‌లో సినిమా విడుదల కావచ్చని కూడా ఆయన పేర్కొన్నారు. రాజ్‌కుమార్ రావు తన పాత్రను పోషించడం పట్ల తాను సంతోషంగా ఉన్నానని, సినిమాకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని గంగూలీ చెప్పారు. రాజ్‌కుమార్ రావు కూడా ఈ పాత్రపై తన ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. గంగూలీ గారి బయోపిక్‌లో నటించడం అనేది చాలా పెద్ద బాధ్యత. కాస్త ఆందోళనగా ఉంది, కానీ చాలా సరదాగా కూడా ఉంటుందని అనుకుంటున్నాను" అని ఆయన తెలిపారు. గంగూలీ బెంగాలీ కావడంతో, ఆ భాషను నేర్చుకుంటున్నానని, తన భార్య పత్రలేఖ (ఆమె బెంగాలీ) సహాయం తీసుకుంటున్నానని రాజ్‌కుమార్ రావు వెల్లడించారు.






## సుమంత్ సినిమాను మెచ్చుకున్న మహేశ్

మహేష్ బాబు ఎంత పెద్ద స్టార్ హీరోనో అంతే మంచి మనిషి.. సాయంలోనే కాదు తన సినిమాలతో పాటు పక్కవారి సినిమాలను కూడా ఎంతో సపోర్ట్ చేస్తూ ఉంటారు. చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా తన సపోర్ట్ అందిస్తూ ఉంటారు. ఇప్పటికే మహేష్ బాబు ఎన్నో సినిమాల టైటిల్స్, టీజర్లు, సాంగ్స్ ను రిలీజ్ చేశారు. అలాగే తాను చూసిన సినిమా ఏదైనా మంచిగా అనిపిస్తే వెంటనే సోషల్ మీడియా వేదికగా ఆ సినిమా టీమ్ కు అభినందనలు తెలుపుతారు మహేష్. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆయన ఓ ఎమోషనల్ డ్రామా పై ప్రశంసలు కురిపించారు. ఇటీవలే కుబేర సినిమా పై ప్రశంసలు కురిపించిన మహేష్ తాజాగా మరో సినిమాను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ సినిమా ఏ దంటే.. ఇటీవల విడుదలై మంచి రెస్పాన్స్ సొంతం చేసుకున్న సినిమాల్లో అనగనగ సినిమా ఒకటి. సుమంత్, కాజల్ చౌదరి జంటగా నటించిన ఈ సినిమా ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సినిమాలో సుమంత్ తన నటనతో ఆకట్టుకున్నాడు. ఈ సినిమా డైరెక్ట్ గా ఓటీటీలో విడుదలైంది. తండ్రి కొడుకు మధ్య ఉండే ఎమోషనల్ బాండ్ ను చక్కగా చూపించారు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు తమ అభిప్రాయాన్ని ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తాజాగా మహేష్ బాబు కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపించాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com